సంచలన సాయంకాల పత్రిక
# సత్యం
https://www.satyamdaily.net/
సోమవారం 24-3-2025
సంపుటి: 20 సంచిక: 306
పేజీలు: 8 వెల: రూ.1

## శిష్టకరణ కుటుంబానికి సీఎం రిలీఫ్ ఫండ్

(సత్యంన్యూస్, విశాఖపట్నం)

కుటుంబ పెద్ద మరణంతో ఆర్థిక ఇబ్బందులు పడుతున్న శిష్టకరణ కుటుంబానికి సీఎం రిలీఫ్ ఫండ్ మంజూరయ్యేలా చేసి, ఆ నగదుకు సంబంధించిన చెక్కును ఆంధ్రప్రదేశ్ శిష్టకరణం సంక్షేమ సంఘం అధ్యక్షులు ఆక్కుమహంతి రాజా అందించారు. డిసెంబరు 25న విశాఖపట్నం పర్యటనలో భాగంగా కంటిమహంతి విరూప్ మరణం గురించి తెలుసుకొని వారి కుటుంబ సభ్యులను పరామర్శించేందుకు వెళ్లిన రాజా ఆ కుటుంబ ఆర్థిక పరిస్థితి తెలుసుకున్నారు. ఎమ్మెల్యే గణబాబు సూచన మేరకు కూటమి ప్రభుత్వం ద్వారా ఆర్థికంగా ఆదుకోవాలని నిర్ణయించుకొని విరూప్ కుటుంబానికి సీఎం రిలీఫ్ - మిగతా చివరి పేజీలో





# మీరు సూపర్ సార్..!

## మీ ప్రతిష్ఠ కోసం జిల్లా పరువు తీశారు

- గుడ్డ కాల్చి ఉపాధ్యాయుల మీద వేసిన డీఈవో
- 400 పైబడిన విద్యార్థులున్నచోట ఐదుగురు దొరికితే అంత హడావుడెందుకు?
- అరగంట పరీక్షా కాలం కోల్పోయిన విద్యార్థుల మాటేమిటి?
- కుప్పిలిలో ఎప్పుడూ చూసిరాతలేనని తెలిసినప్పుడు ఇన్విజిలేటర్లను ఎందుకు మార్చలేదు?
- డీఈవో కుడిభుజం, కుడికన్ను ఎంఈవోలను ఎందుకు అక్కడ కూర్చోబెట్టలేదు?
- ఉపాధ్యాయులు సరే.. గుమస్తా మీద చర్యలను ఎలా సమర్థిస్తారు?

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

నిజాయితీపరుడు కాకపోయినా ఫర్వాలేదు.. అలా అనిపించుకోవడం సమాజంలో పైకి రావడానికి చాలా అవసరం. నిజాయితీపరుడన్న అబద్ధం జాగ్రత్తగా ప్రచారంలోకి తీసుకొచ్చిన తర్వాత ఎంత కష్టమైన పనైనా ఎడమచేత్తో చేసిపారేస్తామన్న కల్పనల్ని ప్రచారంలోకి తీసుకురావాలి. అప్పటివరకు కష్టపడి ఏదైనా పూర్తిచేసిన వారి కంటే సునాయాసంగా కీర్తికిరీటాన్ని నెత్తికెత్తుకోవాలి. సునాయాసంగా పబ్లిసిటీ పొందినవారిపైనే ప్రజలకు గౌరవం ఎక్కువ కలుగుతుంది. ఇది ప్రస్తుతం మార్కెట్లో చలామణిలో ఉన్న వ్యక్తిత్వ వికాస సూత్రం. విద్యార్థులకు ప్రతీ మోటివేటర్ ఈమధ్య ఇదే బోధిస్తున్నాడు.

అసలే ఆయన ఉపాధ్యాయుడు.. అందులోనూ ఉపాధ్యాయులను తయారుచేసే కళాశాలకు చీఫ్. ఇంకా సూటిగా చెప్పాలంటే జిల్లాలో పాఠాలు చెప్పే ఉపాధ్యాయులందరికీ బాస్. కాబట్టి.. ఇటువంటి సూత్రాలు ఆయనకు ఎవరూ నేర్పక్కర్లేదు. సునాయాసంగానే వంటబట్టించుకున్నారు. అందుకే జులైలో పదవీ విరమణ చేయడానికి సిద్ధంగా ఉన్న జిల్లా విద్యాశాఖాధికారి తిరుమల చైతన్య జిల్లా చరిత్రలో తన పేరు చిరస్థాయిగా నిలిచిపోవడం కోసం ఓ పెద్ద పబ్లిసిటీ స్టంట్‌నే సునాయాసంగా చేసిపారేశారు. కాకపోతే వ్యక్తిగత ప్రతిష్ఠ కోసం జిల్లా పరువును తాకట్టు పెట్టేశారు.

మొన్నటి వరకు శ్రీకాకుళం జిల్లాలో ఎక్కువ మార్కులతో పదో తరగతి ఉత్తీర్ణత సాధించానని గర్వంగా చెప్పుకునే సగటు విద్యార్థి ఇప్పుడు శ్రీకాకుళంలో తాను టెన్త్ చదివానని చెప్పుకోడానికి సిగ్గుపడే పరిస్థితిని తిరుమల చైతన్య కల్పించారు. కుప్పిలి జిల్లాపరిషత్ హైస్కూల్, మోడల్ స్కూల్ పరీక్షా కేంద్రాల్లో మాల్‌ప్రాక్టీస్ జరిగిందని 14 మంది ఉపాధ్యాయులను సస్పెండ్ చేసి, ఆరుగురి మీద క్రిమినల్ కేసులు పెట్టిన తిరుమల చైతన్య పేరు రాష్ట్రవ్యాప్తంగా మార్మోగివుండొచ్చు. కానీ అదే సమయంలో తమకు సంబంధం లేని కొందరు ఉపాధ్యాయులు అనవసరంగా రచ్చకెక్కాల్సివచ్చిందన్న కోణాన్ని తిరుమల చైతన్య మర్చిపోయారు. కుప్పిలి పాఠశాలలో కాపీయింగ్ జరిగిన మాట వాస్తవం. కాకపోతే 15 మంది సస్పెన్షన్, ఆరుగురి మీద క్రిమినల్ చర్యలకు సిఫార్సు చేసినంత పెద్దది కాదు. ఈ విషయం తిరుమల చైతన్యకు ఎవరూ చెప్పనక్కర్లేదు. ఎందుకంటే రాష్ట్రవ్యాప్తంగా పదోతరగతి పరీక్షలు నిర్వహించే పద్ధతి ఎప్పుడో గతి తప్పిపోయింది. ఎందుకంటే.. ప్రభుత్వమే చూసిరాతలను ప్రోత్సహిస్తోంది. ఫార్మేటివ్ పరీక్షా పత్రాలు యూట్యూబ్‌లో కనిపిస్తే దొరికిపోయామన్న భావనతో ఆ పరీక్షలను రద్దు చేస్తున్నారు తప్ప, బయటకు పొక్కకపోతే నిర్లజ్జగా పరీక్షలను కొనసాగిస్తున్న సమాజంలో ఉన్నాం మనం. ఇప్పుడున్న ప్రభుత్వాలకు ఇది అవసరం. ఈ ఏడాది పదో తరగతిలో చెప్పుకోదగ్గ రిజల్ట్ రాకపోతే ప్రతిపక్షంలో ఉన్న వైకాపా తాము అధికారంలో ఉన్నప్పుడు నాడు-నేడు అనే విధానం ప్రవేశపెట్టడం ద్వారా మంచి రిజల్టును తేగలిగామని, కూటమి ప్రభుత్వం ఫెయిలయిందని ప్రచారం చేస్తుంది. రేపు వైకాపా అధికారంలో ఉంటే తెలుగుదేశం కూడా ఇదే పని చేస్తుంది. ఇక్కడ చదువు, పరీక్షలు, రిజల్టు కూడా ఒక రాజకీయ అజెండానే. కాబట్టి చూసిరాతలు కామననే కాసేపు అనుకుందాం. అయితే ఇది తప్పుకదా..! కష్టపడి పరీక్ష రాసే విద్యార్థి వెనుకబడిపోతున్నాడనే ప్రశ్న తలెత్తుతుంది. దీన్నే తిరుమల చైతన్య సరిగ్గా క్యాష్ చేసుకున్నారు. రెండు సెంటర్లలో కలిపి 400 పైబడి విద్యార్థులు పదోతరగతి రాస్తుంటే.. కేవలం ఐదుగురి వద్ద మాత్రమే స్లిప్పులు దొరికాయి. ఇది ఏ సెంటర్‌లోనైనా జరిగే పనే. 400 మంది పిల్లలున్నచోట ఐదుగురి వద్ద మాత్రమే స్లిప్పులుంటే అది మాల్‌ప్రాక్టీసింగ్ ఎలా అవుతుంది? నిబంధనల ప్రకారం ఒక గదిలో, లేదా ఒక పరీక్షా కేంద్రంలో అందరూ సామూహికంగా చూసిరాస్తేనే మాల్‌ప్రాక్టీసింగ్ అంటారు. కానీ ఇక్కడ రెండు సెంటర్లలో కలిపి ఐదుగురే దొరికారు. అంతమాత్రానికి ఇంత పబ్లిసిటీ అవసరమా అనే ప్రశ్న ఇప్పుడు ఉపాధ్యాయ సంఘాలు లేవనెత్తుతున్నాయి. అన్నిటికీ మించి ట్రిపుల్ ఐటీలో సీటు సంపాదించడం కోసం విద్యార్థుల తల్లిదండ్రులు రూ.30వేలు కనీసంగా, రూ.50వేలు గరిష్టంగా ఇన్విజిలేటర్లకు ముట్టజెబుతున్నారన్న సమాచారం ఉందని డీఈవో తిరుమల చైతన్య పేర్కొనడమే కాకుండా ఆరుగురి మీద క్రిమినల్ కేసులకు ప్రొసీడ్ అయ్యారు. వాస్తవానికి ఈ కేంద్రాల్లో పరీక్ష రాస్తున్న విద్యార్థులందరూ మత్స్యకార గ్రామానికి చెందినవారే. రూ.50వేలు ఉంటే ఏడాది తిని కూచోవచ్చన్న కుటుంబాలే. వీరికి ట్రిపుల్ ఐటీలు, ఐఐటీలు వంటి వాటి మీద అవగాహనే పెద్దగా ఉండదు.. మహా అయితే పదో తరగతి పాసైతే ఏ షిప్పుకో వెళ్లిపోవచ్చన్న ఆశ తప్ప. తన వద్ద ఆధారాలు లేవంటూనే సొమ్ముల అంశాన్ని తెర మీదకు తెచ్చిన డీఈవో తనకు తెలియకుండానే పెద్ద నిందను ఉపాధ్యాయుల మీద వేసేశారు. ఇప్పుడు దీన్ని నిరూపించాల్సిన బాధ్యత డీఈవో మీద లేకపోవచ్చు. కానీ ఈ సస్పెన్షన్, క్రిమినల్ కేసుల నుంచి బయటకు రావాల్సిన గత్యంతరం మాత్రం ఉపాధ్యాయులదే. గుడ్డ కాల్చి టీచర్ల మీదకు విసిరేసిన డీఈవో ఇప్పుడు దాన్ని ఆర్పుకుంటారో, మండించుకుంటారో అది మీ ఇష్టమనే ధోరణిలో వ్యవహరిస్తున్నారు. మొదట్నుంచి తిరుమలచైతన్య శైలే అంత. సుదీర్ఘ కాలం డైట్ ఇన్‌ఛార్జి ప్రిన్సిపాల్‌గా పని చేసిన ఆయన డైట్ అనేదాన్ని ఓ బ్రహ్మపదార్థంగా మార్చేశారు. ఆయన, ఆయనతో పాటు ఓ గుమస్తాకు తప్ప అక్కడ ఇన్నేళ్లలో ఏం జరిగిందనేది ఇజ్రాయిల్ గూఢచార సంస్థ మొసాద్‌కు కూడా తెలియని రహస్యం. ఇక్కడ రెగ్యులర్ డీఈవోలు బదిలీ లేదా పదవీ విరమణ తర్వాత అడపాదడపా డీఈవోగా తిరుమల చైతన్య వస్తుంటారు. వచ్చిన ప్రతీసారి ఆయన పబ్లిసిటీ స్టంట్‌కు తెర లేపుతుంటారు. అయితే ఈసారి ఈ విన్యాసం పెద్దదయింది. ఒక విద్యార్థి వద్ద రూ.30వేలు నుంచి రూ.50వేలు వసూలుచేశారన్న ఆరోపణల నేపథ్యంలో - మిగతా చివరి పేజీలో

### ఆ సచివాలయానికి
## వేళాపాళా లేదు!

- సమయానికి తెరుచుకోని కార్యాలయం
- అందుబాటులో ఉండని సిబ్బంది
- ఫిర్యాదు చేసినా పట్టించుకోని అధికారులు




(సత్యంన్యూస్, పొందూరు)

ప్రభుత్వ కార్యాలయమంటే నిర్దేశిత సమయాల్లో తెరిచి ఉంచి, ప్రజలకు అందుబాటులో ఉండాలి. అందులోనూ ప్రజల ముంగిటికే ప్రభుత్వం పేరుతో గ్రామ, వార్డు స్థాయిల్లో ఏర్పాటుచేసిన సచివాలయాలు ప్రభుత్వ కార్యాకలాపాలు, సేవలను ప్రజలకు మరింత చేరువ చేయాల్సి ఉంది. కానీ కొన్ని సచివాలయాలు ఈ లక్ష్యాలకు దూరంగా ఉంటే విమర్శల పాలవుతున్నాయి. పొందూరు మండలం తాడివలసలోని గ్రామ సచివాలయం ఇటువంటి విమర్శలనే ఎదుర్కొంటోంది. సిబ్బంది సమయపాలన పాటించడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. చాలా సందర్భాల్లో సమయానికి కార్యాలయ తలుపులు కూడా తెరవడంలేదు. సోమవారం ఉదయం 10.37 గంటల వరకు కార్యాలయానికి తాళాలు వేసి ఉండటమే (ఫొటోలో గమనించవచ్చు) దీనికి నిదర్శనం. ఈ సచివాలయంలో పదిమంది సిబ్బంది ఉంటే ఒక్కరూ కూడా సమయానికి విధులకు హాజరుకావాలన్న ధ్యాస లేదని, తరచూ ఇలాగే జరుగుతోందని స్థానికులు విమర్శిస్తున్నారు. ఇదేమిటని ఎవరైనా ప్రశ్నిస్తే.. సర్వేలు, ఇతరత్రా పనులపై క్షేత్రస్థాయికి వెళ్లామని సమాధానాలు చెబుతున్నారు. అయితే కార్యాలయంలో ఒక్కరైనా లేకుండావెళ్లిపోవడం సమంజసం కాదన్న వాదనలు వినిపిస్తున్నాయి. పనుల కోసం సచివాలయానికి వచ్చే ప్రజలు కార్యాలయం మూసి ఉండటం లేదా సంబంధిత సిబ్బంది లేకపోవడం వల్ల పనులు జరగక ఉసూరుమంటూ వెనుదిరిగి వెళ్లాల్సి వస్తోంది. సచివాలయ సిబ్బంది తీరుపై ఎన్నిసార్లు అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని దీని పరిధిలోని ప్రజలు విమర్శిస్తున్నారు.

### గిరిజన రైతుల శ్రమకు
## జాతీయ గుర్తింపు

- పార్లమెంటులో అరకు కాఫీ ఘుమఘుమలు
- మోదీ, చంద్రబాబులకు కృతజ్ఞతలు
- కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు

**న్యూఢిల్లీ:** ఆంధ్రప్రదేశ్‌లోని అరకు లోయ నుంచి వచ్చిన స్వచ్ఛమైన, జీఐ ట్యాగ్ పొందిన అరకు కాఫీ ఇప్పుడు పార్లమెంటు ప్రాంగణంలో లభిస్తోంది. ఇది కేవలం ఒక కాఫీ స్టాల్ మాత్రమే కాదు, 1.5 లక్షల మంది గిరిజన రైతుల కఠోర శ్రమకు, సంప్రదాయానికి ప్రతీక అని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు అన్నారు. పార్లమెంటులో అరకు కాఫీ అందుబాటులోకి తీసుకురావడానికి ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సహకారం ఎంతో గొప్పదని, వారిద్దరికి ప్రత్యేక అభినందనలు తెలిపారు. అరకు కాఫీ వంటి విశిష్ట ఉత్పత్తులకు గుర్తింపు లభించడానికి వారిచ్చిన తోడ్పాటు ఎన్నటికీ మరువలేమని ఆయన పేర్కొన్నారు. పార్లమెంటులో అరకు కాఫీ స్టాల్‌ను ప్రారంభించిన కేంద్రమంత్రులు పీయూష్ గోయల్, జువల్ ఓరాం, కిరణ్ రిజిజులకు ఆంధ్రప్రదేశ్ ప్రజల తరఫున రామ్మోహన్ నాయుడు ధన్యవాదాలు తెలిపారు. ఇది గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి, భారతీయ సేంద్రీయ వ్యవసాయానికి ప్రపంచ స్థాయిలో గుర్తింపు తెస్తుందని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో విజయనగరం పార్లమెంటు సభ్యులు కలిశెట్టి అప్పలనాయుడు, పలువురు ఎంపీలు, గిరిజన కార్పొరేషన్ చైర్మన్ కిడారి శ్రావణ్, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి సంధ్యారాణి, గిరిజన కార్పొరేషన్ ఎండీ కల్పనాకుమారి పాల్గొన్నారు. అనంతరం వారంతా లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాను మర్యాదపూర్వకంగా కలుసుకొని కృతజ్ఞతలు తెలిపారు



## భవనం సిద్ధం..
# రాజకీయమే అడ్డం!



- సర్వహంగులతో సిద్ధమైన కళ్లేపల్లి పీహెచ్‌సీ భవనం
- నెలలు గడిచినా ప్రారంభానికి నోచుకోని నిర్మాణం
- ఇరుకు గదిలోనే వైద్యంతో సిబ్బంది, రోగుల ఆవస్థలు
- గత ప్రభుత్వం నిర్మించిందన్న ఉపేక్షే కారణమన్న ఆరోపణలు




(డి.వి.రమణ, సత్యం ప్రత్యేక ప్రతినిధి)

ప్రభుత్వ వసతులు లేక ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్న ఉదంతాలు రాష్ట్రంలో చాలాచోట్ల కనిపిస్తూనే ఉంటే.. మరోవైపు కల్పించిన వసతులను వినియోగంలోకి రాకుండా వాటిని నిరుపయోగంగా వదిలేసి శిథిలావస్థకు చేరుస్తున్న దౌర్భాగ్య పరిస్థితులు కూడా కొన్ని చోట్ల కనిపిస్తున్నాయి. ఈ పరిస్థితికి ప్రధానంగా రాజకీయ విభేదాలే కారణమని ఆరోపణలు వినిపిస్తున్నాయి.

గతంలో జిల్లా కేంద్రానికి సమీపంలో నిర్మించిన నర్సింగ్ కళాశాల భవనాలు ఏళ్లు గడిచినా ఇప్పటికీ ప్రారంభానికి నోచుకోక శిథిలమైపోవడం ఒక ఉదాహరణగా నిలుస్తుంటే.. శ్రీకాకుళం రూరల్ మండలం కళ్లేపల్లిలో నిర్మాణం పూర్తి చేసుకున్న ప్రాథమిక ఆరోగ్య కేంద్ర (పీహెచ్‌సీ) భవనం కూడా ఇదే దుర్దశ ఎదుర్కొంటుండటం తాజా ఉదాహరణ.

శ్రీకాకుళం రూరల్ మండలమంతటికీ గతంలో ఒక్క సింగుపురంలోనే పీహెచ్‌సీ ఉండేది. అది తప్పితే జిల్లా కేంద్రంలోని రిమ్స్‌కు పరుగులు తీయాల్సి వచ్చేది. ఈ పరిస్థితుల్లో గత వైకాపా ప్రభుత్వం వైద్య సేవల విస్తరణలో భాగంగా జిల్లాలోని పలు ప్రాంతాలకు పీహెచ్‌సీలు మంజూరు చేసింది. వాటిలో రూరల్ మండలంలో కళ్లేపల్లి ఒకటి. పీహెచ్‌సీతో పాటు సిబ్బందిని కూడా వెంటనే మంజూరు చేయడంతో తాత్కాలికంగా ఒక గదిలో పీహెచ్‌సీ ఏర్పాటు చేసి వైద్యసేవలు అందించడం ప్రారంభించారు. మరోవైపు వైకాపా ప్రభుత్వమే నాడు-నేడు పథకం కింద కళ్లేపల్లి పీహెచ్‌సీకి భవనాలు కూడా మంజూరు చేసింది. రూ.2.60 కోట్లతో ఈ నిర్మాణ పనులకు 2023 నవంబర్ రెండో తేదీన శంకుస్థాపన అప్పటి మంత్రి ధర్మాన ప్రసాదరావు శంకుస్థాపన చేశారు. ఈ భవనంలో పడకలతో సహా వైద్యులు, సిబ్బంది గదులు, చిన్న చిన్న ఆపరేషన్లు చేయడానికి ఆపరేషన్ థియేటర్‌తో పాటు ఏసీ వంటి పరికరాలు కూడా సమకూర్చారు. అన్ని హంగులతో కొన్ని నెలల క్రితమే పీహెచ్‌సీ భవన నిర్మాణాలు పూర్తి చేసుకుని ప్రారంభానికి సిద్ధమయ్యాయి. ఇంతవరకు ఇరుకు గదిలో వైద్యసేవలు పొందుతున్న స్థానికులు ఆ భవనాలను చూసి తమ కష్టాలు తీరుతాయని ఆనందపడ్డారు. కానీ వైకాపా తర్వాత అధికారంలోకి వచ్చిన టీడీపీ కూటమి సర్కారు గానీ, ఆ పార్టీ ప్రజాప్రతినిధులు గానీ పీహెచ్‌సీ భవనం వైపు కనీసం చూడటంలేదు.. దాన్ని ప్రారంభించడానికి చొరవ చూపడంలేదు. వైకాపా ప్రభుత్వం నిర్మించిన భవనాన్ని తామెందుకు ప్రారంభించాలన్న రాజకీయ దురుద్దేశమే దీనికి కారణమన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. కొన్ని నెలలుగా నిరుపయోగంగా ఉన్న ఈ భవనాలు దుమ్ముధూళీ పట్టేస్తున్నాయని, మరికొన్నాళ్లు నిరుపయోగంగా ఉంచితే నిర్మాణాలు దెబ్బతినే ప్రమాదం ఉందని స్థానిక ఆవేదన, ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రాజకీయకోణంలో చూడకుండా పీహెచ్‌సీ భవనాన్ని వెంటనే ప్రారంభించి వినియోగంలోకి తేవాలని నాయకులు, అధికారులకు విజ్ఞప్తి చేస్తున్నారు.

• ఎడిటోరియల్

# అందరూ యోధులే.. అందరిదీ స్వార్థమే!

ఈ యోధుల్లో మన తెలుగు వీరుడు ఒక్కడూ లేకపోవడం మన సిగ్గు అనిపించకపోవచ్చేమోగానీ.. వారినే ప్రతినిధులుగా పెట్టుకున్న మనం మటుకు సిగ్గుపడాల్సిన విషయం. జరిగిన సభ హిందీ భాషను దొడ్డిదారిన బలవంతంగా మన మీద రుద్దే ప్రయత్నాలకు వ్యతిరేకత వ్యక్తం చేయడానికి.. అలాగే నియోజకవర్గాల పునర్విభజన అనేది జనాభా ప్రాతిపదికగా జరిపి జనసాంద్రత తక్కువ కలిగిన దక్షిణాది రాష్ట్రాలకు గుండు కొట్టేసి జన రద్దీ ఎక్కువ కలిగిన ఉత్తరాది రాష్ట్రాల్లో ఎక్కువ సీట్లు ఏర్పాటు చేసుకుని తద్వారా రాజకీయంగా తిరుగులేని ఆధిపత్యాన్ని మన మీద చెలాయించాలని చూస్తున్న ప్రస్తుత మోదీ ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ దక్షిణాది రాష్ట్రాల అధినాయకులు, ప్రతిపక్ష నాయకులు కలిసి చర్చించడానికి, తగిన కార్యాచరణను రూపొందించడానికి ఏర్పాటు చేసుకున్న సమావేశం అది. దానికి మన రాష్ట్రం నుంచి జన బలం కలిగిన నాయకులైన ముఖ్యమంత్రి చంద్రబాబు, 40 శాతం ఓటింగ్ కలిగిన జగన్మోహన్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్.. ఎవరికి వారు ఏవేవో సాకులతో ఆ సభకు గైర్హాజరు కావటం చూస్తే ఆహా తెలుగు వీరులు ఎంతటి యోధులో కదా! అని అనిపిస్తుంది. విషయం రాష్ట్రానికి రాబోయే కాలంలో తీవ్రమైన నష్టాన్ని చేకూర్చేదని తెలుసు. ప్రభుత్వాలను ఏర్పరచడానికి, ప్రధాన మంత్రులను నియమించడానికి చక్రాలు తిప్పి జాతీయ స్థాయిలో గొప్ప శక్తిగా విధులు నిర్వర్తించానని చెప్పుకొనే చంద్రబాబునాయుడు దక్షిణాది రాష్ట్రాల ముఖ్యమంత్రులు, నేతల సదస్సులో కచ్చితంగా అందరికంటే ఎక్కువ నిర్ణయాత్మక శక్తిని కలిగి ఉండేవారు. కాకపోతే ఆయనవన్నీ స్వప్రయోజనాలు, పార్టీ ప్రయోజనాలు తప్ప నిజమైన రాష్ట్ర ప్రయోజనం ఆయనకు ప్రధానం కాదనేది ఇలాంటి చర్యల వల్ల సుస్పష్టమవుతుంది. ఫెయిర్ వెదర్‌లో అందరూ వీరులే. వాలీత కొట్టడానికి గజ ఈతగాడు అక్కర్లేదు. తెలుగోళ్ల కోసమే తెలుగుదేశం పుట్టింది, తెలుగు ఆత్మాభిమానమే తెలుగుదేశం పార్టీ ప్రధాన ఆశయం అనే నినాదాలు ఎంత డొల్లగా మారిపోయాయో సరిగ్గా ఇలాంటి పరీక్షా సమయాల్లో తేలిపోతుంది. ఇక పవన్‌కళ్యాణ్ సరే సరి.. ఆయన మోదీ భక్తుడు. పైగా తన అన్నయ్యకు రాజకీయ శిష్యుడు. సదరు అన్నయ్య మోదీకి పరమ భక్తుడు. పైగా ఆయనకున్న సనాతన బంధాల వల్ల ప్రస్తుతం స్వేచ్ఛగా ఉండే అవకాశాలు లేవు. తన ఆసక్తతను కప్పిపెట్టుకోవడానికి త్రిభాష సూత్రమంటే మనపైకి హిందీని రద్దడం కాదనే వక్రభాష్యాలు వింటే విస్మయం కలుగుతుంది. అదే నిజమైతే ఉత్తరాది రాష్ట్రాల్లో దక్షిణాది భాషలను మూడో భాషగా ఎందుకు అమలు చేయడంలేదో కూడా చెప్పాలి. హిందీని రాజభాషగా ఎందుకు ప్రచారం చేస్తున్నారో కూడా చెప్పాలి. చంద్రబాబునాయుడు అధికార ఎన్డీయే కూటమిలో ఉన్నప్పటికీ దక్షిణాది నేతల మీటింగ్‌కు వెళ్లి తాను ఈ విషయాలన్నీ మోదీ దృష్టికి తీసుకెళ్లి ఆయనను ఒప్పించే ప్రయత్నం చేస్తానని ఉంటే చాలా హుందాగా ఉండేది. అయితే అక్కడికి వెళితే మోదీ ఎక్కడ ఈడీకి పని చెప్తాడేమోననే భయంతో ఇంచుమించు వణికిపోయారు తండ్రీకొడుకులు, వాళ్ల కూటమి భాగస్వామి కూడా. ఇక వైకాపా అధినేత జగన్మోహన్ రెడ్డి విషయానికి వస్తే ఆయన భక్తులు భయంకరమైన ఫొటోలు తీసేస్తున్నారు. సమర్థించడంలో అవసరం వచ్చినప్పుడు సమర్థించవచ్చు, కానీ మరీ ఇంత నిస్సిగ్గుగా ఆత్మను చంపేసుకుని సమర్థించనక్కర్లేదు. జగన్మోహన్ రెడ్డి మోదీతో అసలు ఎప్పుడూ జత కట్టలేదట. ఎవరొద్దన్నారు ఆయనతో పోతే? ఇక్కడుండి మిగిల్చింది ఏంటట? మోదీ తలపెట్టిన ఆర్టికల్ 370 రద్దు, సీఏఏ, ఎన్ఆర్సీ, రైతు చట్టాల ఏర్పాటు.. ఇలా ఏ ఒక్కదానికైనా ఆయన ఎదురు చెప్పడం జరిగిందా? కారణాలు మనకు తెలియనివా? ఇంకెందుకు పనికిరాని సమర్థింపులు? అభిమానం వేరు.. బానిసత్వం వేరు. చెన్నై సమావేశానికి జగన్ వెళ్లకపోవడానికి ఏదో బలమైన కారణం ఉంది. దాన్ని దాచిపెట్టి సమర్థించడమెందుకో? ఆంధ్రకు చెందిన వారిగా తెలంగాణ బిల్లును పెట్టినప్పుడు ఇక్కడ కాంగ్రెస్ జట్టు మేమంతా సోనియాగాంధీని వ్యతిరేకించలేదా? ప్రాంతాల సమస్య వచ్చినప్పుడు నాయకుడి మీద ఉండే పనికిమాలిన అభిమానం దేనికి? ఎందుకీ అనవసర సమర్థింపులు? అయినా ఇక్కడ ఆ ముగ్గురు నాయకుల తప్పు లేదు. తప్పేమైనా ఉంటే అది వాళ్లు మాత్రమే నాయకులని భావిస్తూ తలకెత్తుకుంటున్న ఈ నిర్భాగ్య జనానిది. జనంలో ఇంత బానిసత్వం, ఇంత జడత్వం ఉండి నాయకుడి కోసం కొంప, గోడు అన్ని వదిలేసి వాళ్ల వెనక పోతామనే బానిస కొడుకులతో నిండిపోయిన ఈ ఆంధ్ర రాష్ట్రమే అసలైన నిర్భాగ్యురాలు. నిజానికి ఆంధ్ర ప్రజానీకమే దరిద్రులు.

# నాయకత్వ లక్షణాలు అలవర్చుకోవాలి




(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

విద్య ద్వారా నాయకత్వ లక్షణాలు అలవర్చుకోవాలని ప్రముఖ పారిశ్రామికవేత్త, విజయనగర్ గ్రూప్ ఆఫ్ ఇండస్ట్రీస్ చైర్మన్ దాట్ల తిరుపతిరాజు అన్నారు. గాయత్రి కాలేజీ ఆఫ్ సైన్స్ అండ్ మేనేజ్‌మెంట్ కళాశాలలో జరిగిన వీడ్కోలు కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులు వ్యక్తిత్వం తల్లితండ్రుల, గురువులకు, కళాశాలకు పేరు తేవాలన్నారు. గురజాడ విద్యాసంస్థల అధినేత జీవీ స్వామినాయుడు 'విద్యార్థులు ఇటువంటి శ్రమ, క్రమశిక్షణలతో ఎదిగిన గొప్ప వ్యక్తులను చూసి, వారి జీవితాన్ని చదివి గొప్పవారిగా ఎదగాలన్నారు. అనంతరం ముఖ్య అతిథిని ఘనంగా సన్మానించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పులఖండం శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో కళాశాల టాపర్స్‌ను సత్కరించారు. విద్యార్థుల నృత్యాలు అందరిని అలరించాయి. ఈ కార్యక్రమంలో విజయనగర్ గ్రూప్ ఆఫ్ ఇండస్ట్రీస్ మేనేజింగ్ డైరెక్టర్ దాట్ల వివేకానంద రాజు, డైరెక్టర్ రాఘవరాజు, డైరెక్టర్ సంయుక్త, కరస్పాండెంట్ రంగారావు, వైస్ ప్రిన్సిపాల్ కేవీవీ సత్యన్నారాయణ, మేజర్ మహేష్, హైకోర్ట్ న్యాయవాది విజయ, సీతారాంనాయుడు, డాక్టర్ మార్థండా కృష్ణ, బాలాజీ తదితరులు పాల్గొన్నారు

# ఆడవరం విద్యార్థులకు విజ్ఞాన ఫీల్డ్ ట్రిప్‌యాత్ర

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

గార మండలం ఆడవరం ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు భోగెల ఉమామహేశ్వరావు ఆధ్వర్యంలో విద్యార్థులకు పాఠ్యాంశాల్లో ఉన్న పాఠాల అంశాలపై ప్రత్యక్షంగా అవగాహన కల్పించేందుకు వినూత్న పద్ధతిలో విజ్ఞాన ఫీల్డ్ ట్రిప్‌యాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు శ్రీకాకుళం రోడ్డు రైల్వేస్టేషన్‌కు తీసుకువెళ్లి అక్కడ వచ్చే ట్రైన్ రాకపోకలు, సిగ్నల్స్, ఓవర్ బ్రిడ్జి, టికెట్ తీసుకునే విధానం, గూడ్స్‌రైలు, సాధారణ పాసింజర్ రైలు, వందే భారత్, తదితర ట్రైన్లను చూపిస్తూ వాటిపై అవగాహన కలిగించారు. అనంతరం శ్రీకాకుళంలో ప్రసిద్ధి చెందిన గాంధీ మందిరం, స్వాతంత్ర్య సమర యోధుల స్మృతివనం ఆడవరం విద్యార్థులు సందర్శించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు మాట్లాడుతూ దేశం కోసం ధర్మం కోసం స్వాతంత్ర స్ఫూర్తిని, సేవానిరతిని బాల్యం నుంచే అలవర్చుకునేందుకు శ్రీకాకుళం నగరంలోని గాంధీ మందిరం, స్వాతంత్ర సమరయోధుల స్మృతి వనం ఒక పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చెందుతుందన్నారు. గాంధీమందిరంలో మొదట భగత్‌సింగ్ వర్ధంతి సందర్భంగా భగత్‌సింగ్ విగ్రహానికి నివాళులర్పించారు. అనంతరం మౌనముద్రలో ఉన్న మహాత్మాగాంధీ, స్వామి వివేకానంద, గౌతమబుద్ధుడు, అబ్దుల్ కలాం, గురజాడ అప్పారావు, మదర్‌థెరిసా తదితర విగ్రహాల వద్ద నివాళులర్పించారు. అనంతరం జిల్లా కేంద్ర ఆస్పత్రి రిమ్స్‌ను సందర్శించారు. గాంధీపార్కులో విశ్రాంత ప్రధాన ఉపాధ్యాయులు ఇద్ది పాపయ్య పిల్లలను ఆశీర్వదిస్తూ ఇలాంటి విజ్ఞాన ఫీల్డ్‌యాత్రలో నిర్వహించడం వలన విద్యార్థులకు మానసికోల్లాసం కలుగుతుందన్నారు. జిల్లా కేంద్ర గ్రంథాలయంను సందర్శించారు. పురుషుల డిగ్రీ కళాశాల, నగరంలో అతిపెద్ద సహాయమాత చర్చి, జామియా మసీదు, శ్రీకాకుళం సెంట్రల్ లైన్స్ క్లబ్, అరసవల్లి ఆలయాన్ని సందర్శించారు కార్యక్రమంలో గ్రంథాలయాధికారి బుర్రి కుమార్‌రాజు, నటుకుల మోహన్, డిస్ట్రిక్ట్ జోనల్ చైర్మన్ బాడాన దేవభూషణ్, అరసవెల్లి ప్రధాన అర్చకులు ఇప్పిలిశంకర్ శర్మ, సహాయ ఉపాధ్యాయులు సోనిమి పాపారావు, కలమ్మలు పాల్గొన్నారు..




### డీఈఓ వైఖరిపై
# నల్లరిబ్బన్లతో నిరసన

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

రూరల్ మండలం, పాత్రునివలస జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఇటీవల కుప్పిలిలో 10వ తరగతి పరీక్షా కేంద్రంలో అక్రమంగా ఉపాధ్యాయులపై సస్పెన్షన్ వేటు వేసిన జిల్లా విద్యాశాఖాధికారి వైఖరికి నిరసనగా జిల్లా ఉపాధ్యాయ సంఘాల ఉమ్మడి వేదిక పిలుపుమేరకు ఉపాధ్యాయులు నల్ల రిబ్బనులు ధరించి విధులకు హాజరయ్యారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి జిల్లా ఫోర్టో చైర్మన్, రాష్ట్ర భాషోపాధ్యాయ సంస్థ జిల్లా అధ్యక్షులు, ఏపీ జేఏసీ అమరావతి జిల్లా వైస్‌చైర్మన్ పిసిని వసంతరావు మాట్లాడుతూ పదవతరగతి శుక్రవారం జరిగిన ఇంగ్లీష్ పరీక్ష రోజు కుప్పిలి పరీక్షా కేంద్రంలో జిల్లా విద్యాశాఖాధికారి, వారి బృందం ప్రశాంతంగా జరగవలసిన పరీక్షలలో భయానక వాతావరణం సృష్టించి ఇటు ఉపాధ్యాయులను, అటు విద్యార్థులను మానసిక వేదనకు గురి చేసేలా సస్పెన్షన్లను, డిబార్లు చేశారన్నారు. విలువైన పరీక్షా సమయాన్ని వృథా చేసేలా తనిఖీ బృందం ప్రవర్తించిందని తల్లిదండ్రులు వాపోతున్నారన్నారు. తప్పు చేసిన దోషులను శిక్షించడంలో జిల్లాలో ఏ ఉపాధ్యాయ సంఘం వెనకేసుకుని రాదని, అభం శుభం తెలియని ఉపాధ్యాయులను తమ ఏళ్ల సర్వీసులో ఎటువంటి రిమార్కులేని ఉపాధ్యాయులను అక్రమ సస్పెన్షన్లు చేసి మానసిక వేదనకు గురిచేయడం తగదన్నారు. శ్రీకాకుళం జిల్లా ఉపాధ్యాయుల ప్రతిష్టను రాష్ట్రంలో అప్రతిష్టపాలు చేసేలా ఒక ప్రక్క క్రిమినల్ కేసులు పెట్టి విచారణ జరుగుతున్న సమయంలో నిరాధార ఆరోపణలతో వీడియోలు విడుదల చేయడం ఎంతవరకు సమంజసమన్నారు. తక్షణమే అక్రమ సస్పెన్షన్ ఎత్తివేయాలని, లేనిపక్షంలో ప్రత్యక్ష పోరాటానికి శ్రీకాకుళం జిల్లా ఉపాధ్యాయ సంఘాల ఉమ్మడి వేదిక తరుపున సిద్ధమవుతున్నామని హెచ్చరించారు. పాఠశాలలో నిరసన తెలియజేసిన వారిలో తాండ్ర వెంకటరమణ, బుడుమూరు అప్పలనాయుడు, బెండి శారద, షాజాది భాను, రాజనాల సతీష్ రాయుడు, బొంగు వెంకటరమణ,తంగి పద్మావతి తదితరులున్నారు.






చాలా ఏళ్ళ క్రితం టీవీలో ఈ అమ్మాయి ఇంటర్వ్యూ చూస్తుంటే తెలుగమ్మాయి కాకపోయినా... అటజనికాంచే..పద్యం..అల్లసాని పెద్దన రాసినది అనుకుంటున్నా నేను గుర్తులేదు. మారోజుల్లో ఇదొక టంగ్‌ట్విస్టర్.. ఈ పద్యాన్ని కంఠస్థం పట్టినట్టు ఉంది చక్కగా చెప్పేసింది. తర్వాత లక్ష్మీ మంచు చేసిన ఇంటర్వ్యూలో అనుకుంటా.. ఏ ఛానల్‌లో చూసినా నువ్వే కనిపిస్తున్నావ్ అని అడగ్గానే... అంటే డిస్కవరీ ఛానల్‌లో కూడానా అని తనమీద తనే జోక్ వేసుకుంది ఈ అమ్మాయి.. తనే పాపులర్ సుమ. నాగార్జున గారికి నాకూ వయసు ఒక పర్టిక్యులర్ ప్లేస్‌లో ఆగిపోయింది అంటూనే పెద్దవారితో వాళ్ళకి తగినట్టు ప్రవర్తిస్తుంది. యూత్ కంగారు పడేలా వాళ్ళతో కలిసిపోయి అల్లరి చేస్తుంది.

# యాంకర్ సుమ.. స్పాంటేనిటీ హంగామా!!

మన దేశంలో పెళ్ళైన ఆడవాళ్ళు కెరీర్‌లో ఊహించని స్థాయికి వెళ్ళాలి అంటే చాల..చాలా కష్టం. అది సుమ ఎలా బ్యాలన్స్ చేసుకుంటుందో కానీ నిజంగా గ్రేట్. ఈనాడు లాంటి సంస్థ ప్రతీ ఆదివారం వచ్చే ఈనాడు అనుబంధం బుక్ కవర్‌స్టోరీ కోసం మహా కసరత్తు చేసి ప్రచురిస్తుంది. అలాంటి ఈనాడు కూడా సుమ మీద కవర్‌స్టోరీగా బుక్‌లో రెండు పేజీలు కేటాయిం చింది ఆమధ్యన. ఒక రోజులో, ఒక సంవత్సరంలో సుమ సాధించిన విజయం కాదు. ఏళ్ల తరబడి ఇక్కడ ఉంటూ అవగాహన పెంచుకుని, కరెంట్ అఫైర్స్‌ను ఫాలో అవుతూ, ట్రెండ్‌కి తగినట్టు అప్డేట్ అవుతుంది. గొంతు సవరించుకుని చకచక ప్రోగ్రాంను నడిపించడంలో తన స్టైల్ వేరంతే.. చాలా విమర్శలు వస్తున్న వెనకడుగు వేయకుండా ముందుకు వెళ్లడం తనకి ఈ గుర్తింపు ఇచ్చిన కెరీర్‌ను గౌరవిం చడం అంతే.. ఎవరూ వందశాతం పెర్ఫెక్ట్‌గా అవతలి వారికి నచ్చేలా ఉండలేరు. అలాగే చిన్నచిన్న పొరపాట్లు చేయడం కూడా జరుగుతుంది. అలాంటివి ఓవర్ కం చేస్తే ఇబ్బంది లేదు. సుమ కూడా మీడియా వ్యక్తి కాబట్టి కొన్నికొన్ని లైటర్ వెయిన్‌లో తీసుకోకూడదు అనిపిస్తుంది. అప్పుడప్పుడు తను ట్రోల్ అయినప్పుడు ఇలా అనిపించింది అంతే తప్ప సుమకి చెప్పే స్థాయిలో నేను లేను.

కానీ ఒక గోల్ అనుకుని అది రీచ్ అవడానికి తపన పడి కృషి చేసి,చేస్తూ సేమ్ స్థితిలో సస్టైన్ అయి కొన్నాళ్లపాటు ఆ లెగసీనీ కాపాడుకుంటూ, నిలబెట్టుకుంటూ ఉండటం మాత్రం చాలా కష్టమైన పని.

అది సుమ చేస్తుండటం ఇన్స్పైర్ అయ్యే విషయం కచ్చితంగా. తన ప్రెజెన్స్, తన బిజీ షెడ్యూల్స్ చూసి అసూయ పడటం కంటే తనెలా సాధించింది అనేది నేర్చుకుంటే బెటర్ కదా..

### మార్చి 22 యాంకర్ సుమ జన్మదినోత్సవం సందర్భంగా..

నాకు సుమ దగ్గర బాగా నచ్చే విషయం... తను చెప్పిందే. కోడి నిద్ర లేచినప్పుడు లేస్తా అది కొక్కరకో అంటుంది నేను అనను అంతే..మళ్ళీ ఊరంతా నిద్రపోయే దాకా పనిచేస్తా.. పనిలోనే విశ్రాంతి.. పనిలోనే సరదా.. అని.. విశ్రాంతి అంటే పని ఆపి తీసుకునేది.. ఈ అర్థం తనెలా తీసుకుందో చూసి ఆశ్చర్యపడటం నావంతు అయ్యింది.. స్ట్రిక్ట్‌గా ఒకటి మాత్రం చెప్తా..యాంకర్ కావాలి అనుకునేవారికి సుమ కచ్చితంగా స్కిప్ చేయకుండా చదవాల్సిన ఒక సిలబస్.

- ఫేస్‌బుక్ నుంచి..

# ఈ దెబ్బ గేమ్ ఛేంజర్‌ను మరిపించేలా ఉండాలి!!

రామ్‌చరణ్ కెరీర్‌లో 'గేమ్ ఛేంజర్' ఒక పెద్ద ఎదురుదెబ్బగా నిలిచిన విషయం తెలిసిందే. భారీ అంచనాలతో విడుదలైన ఆ సినిమా, ఫ్యాన్స్‌ను తీవ్రంగా నిరాశపరిచింది. దాంతో 'తరవాత సినిమా ఏంటీ? ఎలాంటి ప్రాజెక్ట్‌తో రెడీ అవుతున్నాడు?' అనే కుతూహలంతో అభిమానులు ఎదురుచూస్తున్నారు. ఇప్పుడు బుచ్చిబాబు సానా దర్శకత్వంలో చరణ్ చేస్తున్న కొత్త చిత్రం ఫైనల్‌గా హోప్స్‌ను పెంచింది. ఇంకా టైటిల్ ఖరారు కాకపోయినా, ఫస్ట్ గ్లింప్స్ వచ్చేలోపే సినిమాపై అంచనాలు ఊపందుకున్నాయి.

కానీ ఇప్పుడు ఇదే మొదటి ట్రేండింగ్ దెబ్బ గేమ్‌ఛేంజర్‌ను మరిపించేలా ఉండాలని ఫ్యాన్స్ ఆశిస్తున్నారు. ఇప్పటివరకు ఈ ప్రాజెక్ట్ గురించి తెలిసింది అంతా కాంబినేషన్ గురించే. చరణ్ బుచ్చిబాబు కాంబో కొత్తగా అనిపించడం, ఏఆర్ రెహమాన్ మ్యూజిక్ అందించడమూ అంచనాలకు బీజం వేశాయి. కానీ సినిమా కాన్సెప్ట్, కథను అభిమానులు అంచనా వేసేందుకు ఏ క్లారిటీ లేదు. స్పోర్ట్స్ డ్రామా అనేది ఓవర్‌వ్యూ మాత్రమే. అసలు కథ ఎమోషన్ ఏంటో, కథానాయకుడి క్యారెక్టర్ ఎలా ఉంటుందో అన్నదానిపై పూర్తి స్పష్టత రావాల్సి ఉంది. అందుకే ఇప్పుడు గ్లింప్స్ కట్‌కి కీలక బాధ్యత వచ్చేసింది. అదే ఈ సినిమా హైప్‌ను ఫ్యూయల్ చేసే అసలైన మూమెంట్. పుట్టినరోజు స్పెషల్‌గా రిలీజ్ చేయబోయే గ్లింప్స్‌కి చిత్రబృందం సీరియస్‌గా పనిచేస్తోంది. సోషల్ మీడియాలో ఇప్పటికే "చరణ్ బర్త్‌డే ట్రీట్ మామూలుగా ఉండదు" అనే టాక్ మొదలైంది.

చూసినవారికి ఇది "నెక్స్ట్ లెవల్" అని ఫీల్ కలిగిందట. అంటే బుచ్చిబాబు చరణ్ కోసం ఒక విభిన్న వాతావరణాన్ని సెట్ చేస్తున్నట్లు అర్థమవుతోంది. లుక్, బాడీ లాంగ్వేజ్, విజువల్ టోన్ అన్నీ న్యూ స్టైల్‌లో ఉండేలా డిజైన్ చేశారట. ఇది వర్కౌట్ అయితే గేమ్ ఛేంజర్ ఫెయిల్యూర్‌ను కప్పేస్తుంది. ఇంకా ఈ సినిమా కథపై, క్యారెక్టర్ డెప్త్‌పై మినిమమ్ హింట్ గ్లింప్స్‌లో ఇవ్వగలిగితేనే, ఫస్ట్ ఇంపాక్ట్ ఉంటుంది. గతంలో 'రంగస్థలం'తో చరణ్ ఒక ఎమోషనల్ మాస్ హీరోగా నిలిచారు. అదే ఫీలింగ్ మరోసారి వస్తుందా లేదా బుచ్చిబాబు కొత్తగా తీర్చిదిద్దిన పాత్రతో చరణ్ మరో లెవెల్‌ను ఎక్స్‌ప్లోర్ చేస్తున్నారా? అన్నది ఈ గ్లింప్స్‌తో తేలిపోతుంది. క్రికెట్, విలేజ్, సమాజంలో మార్పు.. అన్నిటినీ మిక్స్ చేస్తే ఓ ఇంటెన్స్ కథ రావచ్చు అనే ఆశ అభిమానుల్లో ఉంది. చివరగా చెప్పుకోవాల్సింది ఒక్కటే. చరణ్‌కి 'గేమ్ ఛేంజర్' ఒక గుణపాఠంగా మిగిలింది. ఇప్పుడు బుచ్చిబాబుతో చేస్తున్న ఈ ప్రాజెక్ట్‌నే రీడెంప్షన్‌గా ఫ్యాన్స్ చూస్తున్నారు. అందుకే "మొదటి దెబ్బ గేమ్ ఛేంజర్‌ను మరిపించేలా ఉండాలి" అనే డిమాండ్ సోషల్ మీడియాలో హైలైట్ అవుతోంది.

- తుపాకి.కామ్ సౌజన్యంతో...



# నియోజకవర్గ రోడ్లకి మహర్దశ

(సత్యంన్యూస్, ఆమదాలవలస)

నియోజకవర్గంలోని రోడ్లకు మహర్దశ కలిగినంది పీయూసీ చైర్మన్, ఎమ్మెల్యే కూన రవికుమార్ పేర్కొన్నారు. నియోజకవర్గ పరిధిలోని బూర్జ మండలంలో సీఎస్‌పీ రోడ్ టూ నెలిపర్తి వయా కంట్లాం బీటీ రోడ్డుకు రూ.20కోట్లతో పది కిలోమీటర్ల తారురోడ్డు పనులకు శంకు స్థాపన చేసి పనులు ప్రారంభించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ పి.విశ్వప్రసాద్, మార్క్‌ఫెడ్ డైరెక్టర్ ఆనెపు రామకృష్ణ, మండల అధ్య క్షులు రాంజీ, పైడి సత్యప్రసాద్, కూటమి ముఖ్య నేతలు ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



# ఘనంగా క్షయవ్యాధి నివారణ దినోత్సవం

(సత్యంన్యూస్, ఎచ్చెర్ల)

మండలంలోని పొన్నాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని దుప్పల వలస డాక్టర్ బీఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాలలో సోమవారం ప్రపంచ క్షయవ్యాధి నివారణ దినోత్సవం కార్యక్రమం నిర్వహించారు. స్థానిక హెల్త్ అసిస్టెంట్ ఇప్పిలి చిట్టిబాబు మాట్లాడుతూ ప్రతి సంవత్సరం మార్చి 24న ప్రపంచ క్షయవ్యాధి నివారణ దినోత్సవం జరుపుతున్నామన్నారు. 1882 సంవత్సరంలో డాక్టర్ రాబర్ట్ కోచ్ అనే శాస్త్రవేత్త ట్యుబర్క్లోసిస్ వ్యాధికారక బాక్టీరియాను కనుగొన్నారని, ఈవ్యాధి ప్రాణాంతకమైనా కూడా నివారించదగిన వ్యాధన్నారు. దీనిపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని సూచించారు. ఈవ్యాధి డ్రాప్‌లెట్ ఇన్ఫెక్షన్ ద్వారా ఒకరి నుంచి మరొకరికి వ్యాపిస్తుందన్నారు. రెండు వారాలకుమించి దగ్గు, జ్వరం, రాత్రిపూట చెమటలు పట్టడం, ఆకలి మందగించడం, బరువు తగ్గడం వంటి లక్షణాలు ఉంటాయన్నారు. దీనికి అన్ని ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఉచితంగా మందులు అందుబాటులో ఉన్నాయని, వ్యాధిగ్రస్తులు క్రమపద్ధతిలో మందులు వాడటం వల్ల పూర్తిగా నయం అవుతుందన్నారు. పుట్టిన బిడ్డలకు వెంటనే బీసీజీ వ్యాక్సిన్ వేయించడం ద్వారా ఈ వ్యాధి నుండి రక్షణ పొందవచ్చున్నారు. సమావేశంలో ప్రిన్సిపాల్ బుచ్చిరాజు, కళాశాల ఆరోగ్య పర్యవేక్షకులు ఆర్. సురేంద్ర కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.




# ఉపన్యాస పోటీల్లో పేడాడ చంద్రశేఖర్ విజేత

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

యువజన కాంగ్రెస్ జాతీయస్థాయిలో ప్రతిష్టాత్మకంగా ప్రతి ఏడాది నిర్వహించే ఉత్సవాల్లో భాగంగా "యంగ్ ఇండియా కే బోల్ సీజన్-5" ఉపన్యాస పోటీల్లో ఏపీ కాంగ్రెస్ పార్టీకి చెందిన యువజన విభాగం నాయకుడు, జిల్లాకు చెందిన పేడాడ చంద్రశేఖర్ ఆజాద్ మొదటి విజేతగా నిలిచారు. పాట్నాలో జాతీయ యువజన కాంగ్రెస్ ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన మూడురోజుల ఉత్సవాలు ఆదివారం రాత్రి ముగిశాయి. ఈ సందర్భంగా వివిధ విభాగాల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. మొదటి బహుమతిగా చంద్రశేఖర్ ఆజాద్‌కు రూ.50వేలు నగదుతోపాటు ప్రశంసా పత్రాన్ని కాంగ్రెస్ పార్టీ జాతీయ నాయకత్వం ఈ ఉత్సవంలో అందజేసింది. గతనెలలో దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాల్లో వివిధ విభాగాల్లో విజేతలందరూ పాట్నా యువజనోత్సవాల్లో తలపడ్డారు. ఈ సమాచారాన్ని ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ అధికారిక వెబ్‌సైట్‌లోను, ఫేస్‌బుక్‌లోను ప్రముఖంగా ప్రస్తావించింది. ఆజాద్‌కు జాతీయస్థాయి గుర్తింపురావడంపట్ల పలువురు కాంగ్రెస్ నేతలు, ప్రజాసంఘాల నాయకులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.




# చేయిచేయి కలిపి క్షయవ్యాధిని అరికట్టాలి



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

చేయి చేయి కలిపి క్షయ వ్యాధిని అందరూ కలసికట్టుగా పారదోలాలని జిల్లా న్యాయశాఖ సేవాధికార సంస్థ, కార్యదర్శి, ఆర్. సన్యాసినాయుడు పిలుపునిచ్చారు. సోమవారం జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయం ఆవరణలో జిల్లా క్షయ నివారణ సంస్థ ఆధ్వర్యంలో ప్రపంచ క్షయ వ్యాధి నివారణ దినోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా న్యాయశాఖ సేవాధికార సంస్థ, కార్యదర్శి, ఆర్.సన్యాసినాయుడు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. తొలుత జిల్లా న్యాయశాఖ సేవాధికార సంస్థ, కార్యదర్శి ఆర్.సన్యాసినాయుడు వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయం నుండి జెండా ఊపి ప్రపంచ క్షయవ్యాధి దినోత్సవం ర్యాలీని ప్రారంభించారు. ఈ ర్యాలీ ఏడురోడ్ల కూడలి చేరుకొని అక్కడ ర్యాలీలో పాల్గొన్నవారితో ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయ సమావేశమందిరంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ముఖ్యఅతిథి మాట్లాడుతూ ప్రశంసాపత్రాలు పొందిన ప్రతీఒక్కరు మరింత బాధ్యతగా పనిచేయాలన్నారు. వ్యాధి నిర్మూలనకు నిరంతరం కృషి చేస్తున్న వారికి గుర్తించి ప్రశంసాపత్రాలు అందజేయడం చాలా మంచి పరిణామమన్నారు. దగ్గు క్రమం తప్పకుండా రెండువారాల వరకు ఉంటే దగ్గరలోని ప్రభుత్వ ఆసుపత్రులకు వెళ్లి పరీక్షలు చేయించుకోవాలని, క్షయ వ్యాధి నిర్ధారణ అయితే వెంటనే మందులు వాడకం ప్రారంభించాలన్నారు. చేయిచేయి కలసికట్టుగా క్షయవ్యాధిని పారదోలాలన్నారు. జిల్లాలో క్షయ వ్యాధి పీడితుల కోసం సమర్థవంతమైన చికిత్స అందించుటకు పట్టణ, గ్రామీణ ప్రాంతాలలో ప్రభుత్వం చర్యలు తీసుకుందని చెప్పారు. మందులు ప్రభుత్వమే సరఫరా చేస్తుందన్నారు. వ్యాధి నియంత్రించేందుకు మందులు వాడుతూ పౌష్టిక ఆహారం తీసుకుంటే తగ్గిపోతుందన్నారు. జిల్లా వైద్య ఆరోగ్య అధికారి మాట్లాడుతూ ప్రధాన మంత్రి సూచనల మేరకు క్షయ నిర్మూలనకు ప్రతీఒక్కరూ నిరంతరం కృషి చేయాలన్నారు. పరీక్షలు చేయడానికి అధునాతన పరికరాలు ఉన్నాయని, ప్రభుత్వ ఆసుపత్రల్లో ఉచితంగా పరీక్షలు చేసి మందులు కూడా ఉచితంగానే ఇస్తారన్నారు. వైద్యులు సమాజంలో సేవలు అందజేయడమే లక్ష్యంగా విధులు నిర్వహించాలన్నారు. మంచిసంస్థల నుండి వస్తున్నాయని క్షయవ్యాధి గ్రస్థులు పూర్తిస్థాయిలో మందులు వాడేలా వారికి అవగాహన కల్పించే భాద్యత మనందరిపై ఉందన్నారు. క్షయ నివారణాధికారి డాక్టర్ పడేల శ్రీకాంత్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరు వ్యసనాలకు దూరంగా ఉండాలన్నారు. ఈ వ్యాధి గాలి, తుంపర్ల ద్వారా ఇతరులకు సోకుతుందన్నారు. క్షయవ్యాధి అనుమానం ఉంటే దగ్గరలో ఉన్న ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లి పరీక్షలు చేసుకోవాలని, వ్యాధి నిర్ధారణ జరిగితే మందులు వాడడం ప్రారంభించాలని తెలిపారు. అలాగే పౌష్టిక ఆహారం తీసుకోని తద్వారా క్షయ వ్యాధి నివారణకు అందరం కృషి చేయాలని కోరారు. క్షయవ్యాధి ఉన్న వారికి ప్రభుత్వం మందులు ఉచితంగా పంపిణీ చేస్తుందని తెలిపారు. డాక్టర్ రేష్మి చక్రవర్తి మాట్లాడుతూ దగ్గు, జలుబు, తదితరమైనవి ఉంటే వెంటనే పరీక్షలు చేసుకోవాలన్నారు. తీవ్రతను బట్టి మందులు కాలపరిమితి ఉంటుందని వివరించారు. మందులు క్రమం తప్పకుండా వాడాలని, ఆరు నెలలు వాడి తిరిగి పరీక్షలు చేసుకోవాలని చెప్పారు. మందులు క్రమం తప్పకుండా వాడకపోతే క్షయ వ్యాధి మొండిగా తయారు అవుతుందన్నారు. మంత్రి వెంకటస్వామి, బెజ్జిపురం యూత్‌క్లబ్ అధ్యక్షులు ప్రసాదరావు మాట్లాడుతూ క్షయ వ్యాధి నిర్మూలనకు అందరం కృషి చేయాలని కోరారు. క్షయ వ్యాధి నివారణలో విశేష సేవలందించిన వారికి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో టీబీ నిర్మూలనకు కృషిచేసిన వైద్య సిబ్బందికి, నర్సింగ్ విద్యార్థినీలకు ముఖ్య అతిథి ప్రశంసా పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో ఆరోగ్యశ్రీ కోఆర్డినేటర్ డాక్టర్ ప్రకాష్ రావు, డిపిఎంఓ వాన సురేష్ కుమార్, డిపిఆర్ఓ కె.బాలమాన్ సింగ్, క్లస్టర్ ప్రోగ్రాం మేనేజర్ ఆదిలింగంలు పాల్గొన్నారు.

# లక్ష్యం దిశగా ప్రయాణించాలి

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

లక్ష్యం దిశగా ప్రయాణం సాగించాలని ఏపీడబ్ల్యుజేఎఫ్ రాష్ట్ర కార్యదర్శి, బిహెచిరి తెలంగాణా, ఆంధ్ర రాష్ట్రాల అధ్యక్షులు కొంక్యాన వేణుగోపాల్ పేర్కొన్నారు. ఇటీవల రాష్ట్ర, జిల్లా స్థాయి పెన్కాక్ సిలాట్ పోటీల్లో విజేతలుగా నిలిచిన క్రీడాకారులకు స్థానిక మున్సిపల్ వైఎస్సార్ కళ్యాణ మండపం ఆవరణలో అభినందన సభ సోమవారం నిర్వహించారు. హేమంత్ మార్షల్ ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో క్రీడాకారులు విజేతలుగా నిలవడం అభినందనీయమని ధర్మశాస్త్ర ట్రస్ట్ అధ్యక్షులు బరాటం సంతోష్, వివో ఏఎస్ఎం అంధవరపు సంతోష్, సమగ్ర శిక్ష అసిస్టెంట్ ఇంజనీర్ కొంక్యాన సురేష్, బిహెచిరి జిల్లా అధ్యక్షుడు రౌతు సూర్యనారాయణ, మహిళా విభాగం రాష్ట్ర అధ్యక్షురాలు మణిశర్మ, జిల్లా అధ్యక్షురాలు అంధవరపు జ్యోతిర్మయి, నిర్వాహక అధ్యక్షురాలు సౌజన్య పేర్కొన్నారు. తొలుత క్రీడాకారులు మార్షల్ ఆర్ట్స్ పలు విన్యాసాలు ప్రదర్శించారు. అనంతరం విజేతలుగా నిలిచిన క్రీడాకారులకు సర్టిఫికెట్లు, మెడల్స్ అందజేశారు. ఈ కార్యక్రమంలో హేమంత్ మార్షల్ ఆర్ట్స్ అకాడమీ వ్యవస్థాపకులు వై.హేమంత్‌కుమార్, కోచ్ డి.హరీష్‌లు పాల్గొన్నారు.



# బీసీల చలో ఢిల్లీ కార్యక్రమం వాయిదా

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)



ఈనెల 24,25,26 తేదీలలో జాతీయస్థాయిలో జరప తలపెట్టిన "ఛలో ఢిల్లీ "కార్యక్రమాన్ని అనివార్య కారణాలతో ఏప్రిల్ 1,2 తేదీలకు వాయిదా పడినట్లు,ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ సంఘం ఉత్తరాంధ్ర అధ్యక్షులు కొమ్ము రమణమూర్తి ఒక ప్రకటనలో తెలియజేశారు. ఈసారి జరిపే జనగణనతో పాటే సమగ్ర కుల గణన జరపాలని, చట్టసభలలో బీసీలకు జనాభా దామాషా మేరకు రిజర్వేషన్‌లు ఇవ్వాలని, బీసీ మహిళకు సబ్ కోటానిస్తూ మహిళా రిజర్వేషన్ చట్టానికి సవరణ చేయాలని, పలు డిమాండ్లతో ఏప్రిల్ 1న కేంద్ర మంత్రులు, ఎంపీలకు బీసీ సంక్షేమ సంఘం జాతీయ, రాష్ట్ర నాయకులు వినతులు సమర్పిస్తారన్నారు. 2న బీసీల ప్రధాన డిమాండ్లపై ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద "భారీ నిరసన ధర్నా" జరుగుతుందన్నారు. చలో ఢిల్లీ నిరసన కార్యక్రమాలలో రాష్ట్రంలోని బీసీ నాయకులు, వివిధ కుల సంఘాల నాయకులు పాల్గొని జయప్రదం చేయాల్సిందిగా కొమ్ము రమణమూర్తి విజ్ఞప్తి చేశారు.

# కవులకు అధ్యయనం అత్యవసరం

(సత్యంన్యూస్ శ్రీకాకుళం)

సాహిత్యరంగంలో రాణించాలనుకునే కవులు, రచయితలు తప్పనిసరిగా అధ్యయనం చేయాలని, అప్పుడే వారిలో సాహిత్యం పట్ల సరైన అవగాహన ఏర్పడుతుందని, భాష, భావం బలంగా చెప్పే అవకాశం దొరుకుతుందని, పరిశీలనా దృష్టితో చదివి అవగాహన చేసుకుని నిర్దిష్టమైన భావాలతో తమ కలాన్ని బలంగా వినిపించినప్పుడే సాహిత్యరంగంలో నిలుదొక్కుకోగలరని కేంద్ర సాహిత్య అకాడమి పురస్కార గ్రహీత నారంశెట్టి ఉమామహేశ్వరరావు అన్నారు. వేమన కవితామయం, తపస్వీ మనోహరం సంయుక్తంగా నిర్వహించిన కవితా సంపుటాల పురస్కారాల ప్రధాన సభ శ్రీకాకుళం జిల్లా గ్రంథాలయంలో ఆదివారం ఏర్పాటైంది. ఈ సభకు ముఖ్య అతిథిగా ఆయన ప్రసంగించారు. సభకు ఈ వేమన అధ్యక్షత వహించారు. వక్తలుగా సురంగి మోహనరావు, జంధ్యాల శరత్‌బాబు, ఈ వేమన, బుర్రి కుమార్ రాజు, బలివాడ తేజస్విని ప్రసంగించారు.




# 29న కవిసమ్మేళనం

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

విశ్వావసు నామ ఉగాది సందర్భంగా ఈనెల 29న సాయంత్రం 4 గంటలకు స్థానిక శాంతినికేతన్ కళాశాలలో తెలుగు రచయితల వేదిక ఆధ్వర్యంలో జిల్లాస్థాయి కవి సమ్మేళనం నిర్వహించనున్నారు. ఈ విషయాన్ని సంస్థ అధ్యక్ష, కార్యదర్శులు ఉత్తరావల్లి నాగేశ్వరరావు, ఆర్.వి.రమణమూర్తిలు సోమవారం ఒక ప్రకటనలో తెలియజేశారు. కవి సమ్మేళనంలో పాల్గొనే కవులకు, కవయిత్రులకు సత్కారం ఉంటుందని, ఆసక్తిగల కవులు కె.సంతోష్‌కుమార్ 6303136182కు ఈనెల 28 లోగా ఫోన్ చేసి తమ పేర్లను నమోదు చేసుకోవాలని సూచించారు.

# అర్హతకు తగ్గ అందలం.. అభినందలకు అర్హం!!


(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

రెండున్నర దశాబ్దాలుగా శ్రీకాకుళం జిల్లా ప్రజానీకానికి ఎముకల వైద్య నిపుణులుగా విశిష్ట సేవలందిస్తున్న ప్రొఫెసర్ డాక్టర్ లుకలాపు ప్రసన్నకుమార్ అభినందనీయులని లయన్ వావిలపల్లి జగన్నాథ నాయుడు, అధ్యక్షుడు హర్షవల్లి లయన్స్‌క్లబ్ శ్రీకాకుళం కొమ్ము రమణమూర్తి, డైరెక్టర్ స్వీప్ స్వచ్ఛంద సంస్థ శ్రీకాకుళం అన్నారు. డాక్టర్ ప్రసన్న కుమార్ రిమ్స్ వైద్యకళాశాల హెడ్ ఆఫ్ ది డిపార్ట్మెంట్‌గా పదోన్నతి పొందిన సందర్భంగా ఆయనకు రిమ్స్ కళాశాల శ్రీకాకుళంలో ఘనంగా సన్మానించారు. ట్రామాకేర్‌లో అత్యధిక కేసులకు చికిత్స చేసి గతంలో జిల్లా యాజమాన్యంతో బంగారు పథకంతో సన్మానించారని ఈ సందర్భంగా గుర్తు చేశారు. ప్రొఫెసర్, ఎముకల వైద్య విభాగ అధిపతిగా జిల్లాకు మరిన్ని సేవలందించాలని వారు ఆకాంక్షించారు. కార్యక్రమంలో హర్షవల్లి లయన్స్ క్లబ్ ఉపాధ్యక్షుడు తర్లాడ అప్పలనాయుడు, లుకలాపు గోవిందరావు, అరసవల్లి ఆలయ మాజీ పాలక మండలి సభ్యులు తదితరులు పాల్గొన్నారు.




'సత్యం'లో ప్రకటనల కొరకు సంప్రదించండి
8019 221 221

# ఆత్మకథలు నాటి సమాజానికి దర్పణాలు




(సత్యంన్యూస్, రాజాం)

ప్రముఖ వ్యక్తులు రాసుకున్న ఆత్మకథలు ఆనాటి సమాజాన్ని, పరిస్థితుల్ని అద్దంలా పట్టి చూపుతాయని ప్రముఖ సాహితీవేత్త రౌతు గణపతిరావు నాయుడు తెలిపారు. ఆదివారం స్థానిక విద్యానికేతన్ పాఠశాలలో రాజాం రచయితల వేదిక 122వ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో గణపతిరావునాయుడు 'ఉప్పల లక్ష్మణరావు 'ఆత్మకథను సభ్యులకు పరిచయం చేశారు. బరంపురానికి చెందిన లక్ష్మణరావు జర్మనీ దేశస్తురాలు మిల్లి షోలింగర్‌ను వివాహమాడిన విషయాన్ని, వివాహం తరువాత కూడా వారు మంచిస్నేహితులుగానే మిగిలిపోవడాన్ని ఆయన వివరించారు. వారు ఆదర్శ దంపతులుగా స్వాతంత్ర ఉద్యమానికి చేసిన సేవను వివరించారు. మిల్లీ షోలింగర్ భారతదేశంలో జరుగుతున్న స్వాతంత్రోద్యమ విషయాలను జర్మన్ భాషలో రాసి, జర్మన్ పత్రికలలో ప్రచురింపజేసి ఉద్యమానికి ప్రపంచదేశాల మద్దతు కూడగట్టారన్నారు. ఆనాటి కాంగ్రెస్ పార్టీలో పనిచేసి భారత మహిళా స్వాతంత్రానికి తాపత్రయ పడ్డారని వివరించారు. అనంతరం గణపతిరావు నాయుడిని వేదిక సభ్యులు ఘనంగా సన్మానించారు. డాక్టర్ ఆల్తి మోహనరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో గార రంగనాథం, ఒమ్మి రమణమూర్తి, పిల్లా తిరుపతిరావు, శాసపు సత్యనారాయణ, మూడడ్ల శ్రీనివాసరావు, పొట్నూరు కోటిబాబు, పొదిలాపు శ్రీనివాసరావు, వురిటి గున్నేశ్వరరావు, సమతం మహేశ్వరరావు, కుదమ తిరుమలరావు, జరజాన నీలయ్య, వల్లూరు రామినాయుడు, ముడిల శంకర్రావు, మజ్జి నాగరాజు, కిమిడి సత్యం, అంబల్ల రామమూర్తి, గ్రంధి సాయి సూర్యారావు, పెంకి చైతన్య కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# జిల్లా బేస్‌బాల్ నూతన కార్యవర్గం ఎన్నిక

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

శ్రీకాకుళం జిల్లా బేస్‌బాల్ సంఘంతోపాటు నూతనకార్యవర్గ సభ్యులందరినీ కలుపుకుంటూ బేస్‌బాల్ క్రీడకు విశేష సేవలందిస్తామని, నూతన అధ్యక్షులుగా ఎన్నికైన గుంటముక్కల. వీరభద్రరావు సోమవారం అన్నారు. స్థానిక రామలక్ష్మణ కూడలివద్ద ఒక ప్రైవేట్ హోటల్‌లో శ్రీకాకుళం జిల్లా బేస్‌బాల్ సంఘ సర్వసభ్య సమావేశంతోపాటు నూతన కార్యవర్గ కార్యక్రమాన్ని కార్యనిర్వాహక కార్యదర్శి కొండపల్లి రవికుమార్ అధ్యక్షతన సీనియర్ అడ్వకేట్ మొదలవలస రాజేంద్రకుమార్ పర్యవేక్షణలో ఆదివారం నిర్వహించారు. జిల్లా ఒలింపిక్ సంఘ కార్యదర్శి ఎం.సాంబమూర్తి, డిఎస్డీవో శ్రీధర్, పి.సుందర్, రాష్ట్ర బేస్‌బాల్ సంఘ పరిశీలకులు సీహెచ్ రాజేష్, విజయనగరం బేస్‌బాల్ కార్యదర్శి ఎన్నికలను పరిశీలించారు. గౌరవ అధ్యక్షునిగా కిల్లంశెట్టి అరుణ్‌కుమార్ గుప్తా, నూతన అధ్యక్షులుగా గుంటముక్కల వీరభద్రరావు, ప్రధాన కార్యదర్శిగా వాసుపల్లి రాంబాబు, కోశాధికారిగా చీకటి మూర్తి, సహాయ అధ్యక్షులుగా డి.రామాంజనేయులు, లకిలి రాంబాబు, నిమ్మాన విజయ శ్రీను, సహాయకార్యదర్శులుగా తోటాడ శ్రీను, అంధవరపు సంతోష్‌కుమార్, ఇప్పిలి అరుణ్‌కుమార్, ఆర్గనైజింగ్ సెక్రటరీ కొండపల్లి రవికుమార్, సభ్యులుగా వి.గురుమూర్తి, కె.రమేశ్, ఐ.సాయి కిరణ్, ఐ.గౌరీశంకర్, డి.రాజేష్, ఎం.మధు, కుమారస్వామిలు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారన్నారు. జిల్లా బేస్‌బాల్ సంఘానికి గొప్ప విజయాలను అందించిన సీనియర్ నుండి షబ్ జూనియర్ కేటగిరి వరకు సుమారు 64మంది క్రీడాకారులను ఉత్తమ క్రీడా ప్రతిభా పురస్కారంతో సన్మానించారు. కార్యక్రమంలో జిల్లా బేస్‌బాల్ సంఘానికి సహకరిస్తున్న దాతలు, జిల్లా వ్యాయామ ఉపాధ్యాయులు, జిల్లా క్రీడా సాధికార సంస్థ శిక్షకులు, క్రీడాకారులు, ప్రముఖులు, వక్తలు పాల్గొన్నారు.




డ్రైవర్లు కావలెను
సాయిప్రియ ట్రావెల్స్
శ్రీకాకుళంలో పని చేయుటకు
డ్రైవర్లు కావలెను
కనీసం 2 నుండి 3 సంవత్సరాల అనుభవం కావలెను.
CONTACT:
9440001447, 8341163666

ఎం.ఇర్షాద్
USHA
ఆథరైజ్డ్ డీలర్స్
షాప్: 08942-229343
సెల్: 95731 43409
ఎ.కె. ఎంటర్‌ప్రైజెస్
ఉషా సెవింగ్ మిషన్స్, ఆఫీస్ ఫర్నిచర్..
అన్ని రకాల సెవింగ్ మిషిన్లు, ఫేషన్ మేకర్స్, ఎంబ్రాయిడరీ మిషిన్లు, స్పేర్స్ హోల్‌సేల్
రాజా కాంప్లెక్స్, కరెంట్ ఆఫీసు ఎదురుగా, జి.టి. రోడ్డు, శ్రీకాకుళం - 532 001

SSJ
శ్రీ స్వర్ణ జ్యూయలరీ
ప్రొ॥ వాళ్ళ కిరణ్‌కుమార్
99636 89666, 90009 07133
జి.టి. రోడ్డు, శ్రీకాకుళం
E-mail: sriswarnajewelleries@gmail.com

SAI OPTICIANS
సరస్వతి మహల్ ఎదురుగా, శ్రీకాకుళం
ప్రొప్రయిటర్: బి.రమణమూర్తి
సెల్: 94407 59739
బ్రాంచ్ ఆఫీస్: గవర్నమెంట్ ఆర్ట్స్ కాలేజ్ రోడ్డు, శ్రీకాకుళం, సెల్: 94407 59739

Siva Srinivasa
Sofa Emporium
Lade Chandra Sekhar Rao
Ph. No: 94401 21710
63053 35395, sekharlifestyle99@gmail.com
NEAR SURYA MAHAL THEATRE
WOMEN'S COLLEGE ROAD,
SRIKAKULAM - 532 001




### కూటమి నిర్వాకంతో...

# పెనం నుంచి పొయ్యిలోకి

'నేను నిలబడతాను, మీరు నిలబడతారా' అని విశాఖపట్నం స్టీల్ ప్లాంట్ కార్మికులను ఉద్దేశించి ప్రస్తుత రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ అధికారంలోకి రాకముందు ఆవేశంగా అన్నారు. మోదీ ప్రభుత్వం స్టీల్‌ప్లాంట్ అమ్మక నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ స్టీల్‌ప్లాంట్ కార్మికులు పోరాటం ప్రారంభించారు. ఆ సమయంలో కార్మికుల నిరసనకు మద్దతు తెలిపిన పవన్ కళ్యాణ్ ఈ మాటలను అన్నారు. నాడు అధికారంలోని వైకాపా ప్రభుత్వానికి కేంద్రాన్ని నిలవరించడం చేతకాలేదని విమర్శిస్తూ, స్టీల్‌ప్లాంట్ పరిరక్షణకు సాగుతున్న ఉద్యమానికి సంఘీభావం తెలపడానికి పవన్ కళ్యాణ్ స్టీల్‌ప్లాంట్ జంక్షన్ వద్ద 2021 అక్టోబర్ 31న జరిగిన బహిరంగ సభలో ప్రసంగించారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణను అనుమతించడమంటే ఆంధ్ర రాష్ట్రానికి ఉరి వేయడమేనని ఆవేశంగా ఆయన ఉపన్యసించారు. అక్కడున్న వేలాది మంది కార్మికులను ఉద్దేశించి ఎట్టి పరిస్థితుల్లోను స్టీల్‌ప్లాంట్ కార్మికుల పక్షాన ఉంటానని, స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణను అడ్డుకుంటానని గొప్ప ఉపన్యాసం ఇచ్చారు.

**పవన్ హామీ..**

ఆ సందర్భంలోనే కడదాకా 'నేను నిలబడతాను, మీరు నిలబడతారా' అని కార్మికులను ప్రశ్నించారు. కార్మికులు కూడా నిలబడతాం, నిలబడతాం అని పెద్ద ఎత్తున నినదించారు. రాష్ట్రంలోని జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం మోదీ ప్రభుత్వానికి పూర్తిగా దాసోహం అయిపోయిందని, స్టీల్‌ప్లాంట్ పరిరక్షణ పట్ల దానికి ఏ మాత్రం చిత్తశుద్ధి లేదని, తాను మాత్రం స్టీల్‌ప్లాంట్ రక్షణకు కట్టుబడి ఉంటానని చాలా గట్టిగా హామీ ఇచ్చారు. అంతేకాదు, తమ మంగళగిరి పార్టీ ఆఫీసు వద్ద ఆయన 2021 డిసెంబరు 12న స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ ఒక రోజు దీక్ష కూడా చేశారు. ఆ సందర్భంగా 22 మంది ఎంపీలున్నా వైకాపాకు కనీసం పార్లమెంటులో ప్లకార్డులు కూడా చూపించే చేవ కూడా లేకపోయిందని ఘాటుగా విమర్శించారు. అఖిల పక్ష ప్రతినిధి బృందాన్ని ప్రధాని వద్దకు తీసుకు వెళ్లి ప్లాంట్‌ను రక్షించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

**విమర్శ- డిమాండు..**

ఈ విమర్శ, డిమాండు బాగానే ఉన్నాయి. అయితే ఇప్పుడు వీరి కూటమి ఏం చేస్తోందన్నదే అసలు ప్రశ్న. వీరికీ అంతమంది ఎంపీలున్నారు కదా.. ఇప్పుడు ప్లకార్డులు ప్రదర్శించవచ్చు కదా.. ఏమిటి అడ్డంకి? అలాగే పవన్‌కు ప్రధాని వద్ద మంచి పరపతి ఉందని చెప్పుకుంటారు కదా.. ఆయనే ఒక అఖిలపక్ష ప్రతినిధి బృందాన్ని తీసుకు వెళ్లవచ్చు కదా.. ఏమిటి ఆటంకం? ఇతరులను విమర్శించే అర్హత మనం పాటిస్తేనే కదా వస్తుంది.

**కూటమి హామీ..**

ఆంధ్ర రాష్ట్రంలో ఎన్నికలకు ముందు రాజకీయ సమీకరణాలు శరవేగంగా జరిగాయి. పవన్‌కళ్యాణ్ చొరవతో బీజేపీ, తెలుగుదేశంతో కలిపి కూటమి ఏర్పాటైంది. విశాఖపట్నం స్టీల్‌ప్లాంట్‌ను అమ్మేస్తామని చెప్పిన బీజేపీతో జతకట్టడం ఏమిటి? అలా జతకడితే స్టీల్‌ప్లాంట్ పరిరక్షణ ఎలా సాధ్యమనే సందేహం సహజంగానే చాలామందికి కలిగింది. అయితే, కూటమి నాయకులు ముఖ్యంగా చంద్రబాబు నాయుడు, పవన్‌కళ్యాణ్ కేంద్రంలోనూ రాష్ట్రంలోనూ ఎన్డీయే కూటమి సర్కార్ ఏర్పడితే కేంద్ర ప్రభుత్వంలో అధికారం పంచుకునే తాము గ్యారంటీగా స్టీల్ ప్లాంట్‌ను కాపాడుతామని హామీ ఇచ్చారు.

**భారీ మెజారిటీ..**

ఈ హామీని చాలామంది విశ్వసించారు. ఎందుకంటే ఎన్నికలకు ముందు విశాఖ జిల్లాలోని తెలుగుదేశం, జనసేన నాయకులు కూడా స్టీల్‌ప్లాంట్ పరిరక్షణ బాధ్యత తమదేనని ఇదే వాగ్దానం చేశారు. అయితే, ప్రజలకు బీజేపీ మీద నమ్మకం లేదు. కానీ, వీరిచ్చిన ఈ హామీని విశ్వసించారు. ఓటర్ల తీర్పు కూడా ఈ దిశలోనే వెలువడింది. రాష్ట్రంలో కూటమి భారీ రికార్డు మెజారిటీతో అధికారంలోకి వచ్చింది. వీరి మాటలను విశ్వసించడం వల్లనే విశాఖపట్నం స్టీల్ ప్లాంట్ కార్మికులు అత్యధికంగా ఉన్న గాజువాక అసెంబ్లీ నియోజకవర్గంలోనూ, విశాఖ పార్లమెంటరీ నియోజకవర్గంలోనూ టీడీపీ అభ్యర్థులు రాష్ట్రంలోనే అత్యధిక మెజారిటీతో గెలిచారు.

**డబుల్ ఇంజన్ ధమాకా..**

కట్ చేస్తే, రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. కానీ అదేం విచిత్రమో గాని, ఈ డబుల్ ఇంజన్ సర్కారు ఏర్పడిన తర్వాత విశాఖ పట్నం స్టీల్‌ప్లాంట్‌ను మరింత బలహీనపరిచే చర్యలను మోదీ ప్రభుత్వం తీవ్రతరం చేసింది. అన్ని రకాలుగా దీన్ని దెబ్బ తీసే కుట్రలకు పాల్పడుతోంది. ఉత్పత్తిని ఉద్దేశపూర్వకంగానే తగ్గించేసింది. రవాణాకు రైల్వే వేగన్లు కూడా రాకుండా అడుగడుగునా అడ్డు తగులుతూ వచ్చింది. చివరకు కార్మికులకు గత ఆరు నెలలుగా సక్రమంగా జీతాలు కూడా డబ్బులు ఉన్నా చెల్లించడం లేదు. మరోపక్క 1200 మంది పర్మినెంట్ కార్మికులు, అధికారులను వాలంటరీ రిటైర్మెంట్ ఇచ్చింది. 5,600 మంది కాంట్రాక్ట్ కార్మికులను తొలగించాలని నిర్ణయించింది. ఇప్పటికే వెయ్యిమందికి పైగా తొలగించింది. వీటన్నింటిపై పోరాటానికి నాయకత్వం వహిస్తున్న ప్రధాన నాయకుడికి పై నుంచి ఆదేశాలతో యాజమాన్యం ఛార్జ్ షీట్ ఇచ్చింది. ఇదీ నేటి స్థితి.

**తీరని కష్టాలు..**

ఈ మధ్య కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి 11,400 కోట్ల రూపాయలు స్టీల్ ప్లాంట్‌కు ప్యాకేజీ అని ఆర్భాటంగా ప్రకటించారు. దీంతో స్టీల్ ప్లాంట్ కష్టాలన్నీ తీరిపోతాయని కూటమి నాయకులు హర్షాతిరేకాలు వ్యక్తం చేశారు. కానీ వాస్తవంగా జరిగింది ఏంటంటే, ఈ డబ్బులు బ్యాంకుల అప్పులు తీర్చడానికి, ప్రభుత్వానికి పన్నులు కట్టడానికి మాత్రమే ఉద్దేశించబడ్డాయని, దీని నుంచి ముడిసరుకు కొనడం కానీ, కార్మికుల జీతాలు చెల్లించడం కానీ చేయకూడదని కేంద్ర ప్రభుత్వం షరతు విధించింది. దీంతో గత సంవత్సర కాలంగా కూటమి ప్రభుత్వం రాష్ట్రంలో ఏర్పడిన తర్వాత విశాఖ పట్నం స్టీల్‌ప్లాంట్‌కు మరింత కష్టాలే ఎదురయ్యాయి. నేడు మోదీ ప్రభుత్వానికి పార్లమెంటులో మెజారిటీ లేదు. తెలుగుదేశం, జనసేనకు చెందిన రాష్ట్ర ఎంపీల మద్దతుతోనే ఢిల్లీలో కేంద్ర ప్రభుత్వం మనుగడ సాగిస్తోంది. అందువల్ల మోదీ ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొచ్చి, విశాఖపట్నం స్టీల్‌ప్లాంట్‌ను పరిరక్షించుకోవడానికి గొప్ప అరుదైన అవకాశం నేడుంది.

**నోరు మెదపని పవన్..**

కానీ, దురదృష్టమేమిటంటే అంత ఆవేశంగా నాడు ఉపన్యసించిన పవన్ కళ్యాణ్ నోరు గత సంవత్సరకాలంగా మూగబోయింది. విశాఖపట్నం స్టీల్‌ప్లాంట్‌ను మరింతగా బలహీనపరిచే చర్యలు మోదీ ప్రభుత్వం చేపడుతుంటే, దానిపై ఒక్క మాట కూడా ఆయన మాట్లాడడం మానేశారు. స్టీల్ కార్మిక సంఘాల నాయకులు పవన్‌ను 2024 అక్టోబరు 6న ఆయన ఆఫీసులో కలిసి, ఇందులో జోక్యం చేసుకోవాల్సిందిగా కూడా కోరారు. అయినా కానీ ఉలుకూ లేదు, పలుకూ లేదు. ఇది ఏ రకమైన విశ్వసనీయతో ఆయనకే తెలియాలి. విచక్షణ లేకుండా ఇలాంటి ఊకదంపుడు ఉపన్యాసాలు ఇచ్చి జనాలను మోసం చేయాలనుకోవడం ఏ రకంగా సమంజసమో కూడా ఆయనే చెప్పాలి.

**తీరని ద్రోహం..**

నేడు విశాఖపట్నం స్టీల్‌ప్లాంట్ జీవన్మరణ సమస్యలు ఎదుర్కొంటోంది. కేంద్ర ప్రభుత్వం పైకి మాయ మాటలు చెప్తూనే, మరోపక్క పూర్తిగా నిర్వీర్యం చేసి పీక నులిమేసే అన్ని చర్యలను చేపడుతోంది. తెలుగు ప్రజలు పోరాడి సాధించుకున్న విశాఖపట్నం స్టీల్ ప్లాంట్‌ను పరిరక్షించుకోలేకపోతే చరిత్ర క్షమించదు. కార్మికులు మోదీ ప్రభుత్వ కుట్రలను ఓడించడానికి శతవిధాలా ప్రయత్నం చేస్తూనే ఉన్నారు. అయితే గట్టిగా ఉపన్యాసాలు ఇచ్చిన పవన్ కళ్యాణ్ నేడు నోటికి ఫెవికాల్ అంటించుకుని ఈ ఉద్యమానికి తీరని ద్రోహం చేస్తున్నారు.

మాయమాటలు చెప్పైనా, ఎలాగోలా అధికారంలోకి రావడం అంత గొప్ప విషయమేమీ కాదు. కొన్ని కొన్ని సందర్భాల్లో దుర్మార్గులు కూడా ప్రజలకు మంచివారుగానే కనబడి, ప్రస్తుత ప్రభుత్వాల మీద వ్యతిరేకత ఉంటే ఎన్నికల్లో కూడా గెలుస్తూ ఉంటారు. గత అనేక అనుభవసారం కూడా మనకు ఇదే తెలుపుతోంది. నేడు పవన్ కళ్యాణ్ అటువంటి మోసకారుల జాబితాలో చేరతారా లేదా ఆయన చెప్పే ఉపన్యాసం ద్వారా నిజంగా ప్రభుత్వాన్ని ప్రశ్నించి, విశాఖపట్నం స్టీల్ ప్లాంటును ఇప్పటికైనా కాపాడతారా అన్నది తేల్చవలసిన సమయం ఆసన్నమైంది. ఇప్పుడు కాకపోతే ఇక మరి ఎప్పుడూ కాదన్నది నేటి పరిస్థితి.

**కూటమే కారణం..**

కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం పవన్ కళ్యాణ్ మూగనోమును, కూటమి లొంగుబాటును పూర్తిగా అలుసుగా తీసుకొని, ప్రైవేటీకరణ ప్రక్రియ, స్టీల్ ప్లాంట్‌ను బలహీనపరిచే ప్రక్రియను స్పీడుగా అమలు చేస్తోంది. ఈ నేపథ్యంలో వివిధ కార్మిక సంఘాలు, విశాఖపట్నం స్టీల్‌ప్లాంట్ కార్మికులు పోరాటాన్ని ఉధృతం చేయడానికి నిర్ణయించారు. ప్రస్తుతం రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పాటులో సవ్యసాచి పాత్ర పోషించిన పవన్ కళ్యాణ్ రాష్ట్రానికి ద్రోహం చేస్తారా? రాష్ట్రానికి న్యాయం చేస్తారా?



అన్నదాన్ని బట్టి ఆయన మాటలకు ఎంత విశ్వసనీయత ఉంది అన్నది తెలుస్తుంది. పాత మాటలు గాలికి వదిలేసి, మోదీ భజన బృందంలోనే చేరుతాను, ఊసరవెల్లిలా రంగులు మారుస్తానని ఆయన పయనిస్తుంటే తప్పకుండా రాష్ట్రానికి ద్రోహం చేయడమే అవుతుంది. కాబట్టి పవన్ నిజ జీవితంలో కూడా హీరోగా నిలబడతారా, లేక కష్ట కాలంలో ద్రోహం చేసి జీరోగా మిగులుతారా అన్నది ఆయనే తేల్చుకోవాలి. ఈ సమయంలోనే ప్రజలు కూడా ఆయన మాటలను, హావభావాలను కాక, ఆయన చేతలలో ఏం చేశారు అనేది గమనిస్తూనే ఉంటారు. రాష్ట్రంలో కూటమి ఏర్పాటుకు కర్త, కర్మ, క్రియ పవన్ కళ్యాణ్ అనేది కూటమి నేతలందరూ చెబుతున్నదే. కాబట్టి సహజంగానే కూటమి వల్ల రాష్ట్రానికి జరిగే లాభ నష్టాలకు కూడా ఆయనే బాధ్యత వహించాలి. రాష్ట్రంలోని ఏకైక భారీ పరిశ్రమను కాపాడుకోలేపోతే ఇక డబుల్ ఇంజన్ సర్కార్ వల్ల రాష్ట్రానికి ఒరిగిందేమిటి? పవన్ కూటమి సాధించేమిటి అన్న ప్రశ్న ఉదయించకమానదు.

**ప్రజా ఉద్యమాలే శరణ్యం..**

ఆంధ్ర రాష్ట్రంలో మిగిలిన ఏ రాష్ట్రంలోనూ లేని ఒక విచిత్ర పరిస్థితి నెలకొంది. అదేమిటంటే, ఇక్కడ టీడీపీ, జనసేన ద్వయం, వైకాపా ఇద్దరూ కలహించుకుంటారు. కానీ, కేంద్ర మోదీ ప్రభుత్వానికి మాత్రం పోటీపడి దాసోహమవుతారు. ఫలితంగా రాష్ట్రంలో అసలైన ప్రతిపక్ష పాత్ర ప్రజా ఉద్యమాలే నిర్వహించాలి. ఇటువంటి ప్రభుత్వరంగ సంస్థను కాపాడుకోవడం భవిష్యత్తు తరాలకు రక్ష. రాష్ట్ర ప్రజలు రాష్ట్రాభివృద్ధి దృష్ట్యా మరింత చైతన్యంతో ఆలోచించి నరేంద్ర మోదీ ప్రభుత్వం తన ఈ నిర్ణయం ఉపసంహరించుకునేలా ఒత్తిడి తేవాలి. పోరాడుతున్న కార్మికులకు అండగా నిలవాలి. పోరాటాన్ని ఉధృతం చేయడం ద్వారా కూటమి కుట్రలను భగ్నం చేయాలి. మన మంచి భవిష్యత్తును మనమే నిర్దేశించుకోవాలి.

– **ఎ.అజశర్మ**, ప్రధాన కార్యదర్శి,
ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక, ది వైర్ కోసం

# మీరు సూపర్ సార్..!

(మొదటిపేజీ తరువాయి)

ఇదేదో రాష్ట్రంలో రూ.300 కోట్ల కుంభకోణమన్న చర్చకు తిరుమల చైతన్య తెరలేపారు. వ్యక్తిగత కక్షలా? పబ్లిసిటీ స్టంటా? అనేది పక్కన పెడితే.. జిల్లా పరువును ఆయన తీసేశారు. ప్రధానోపాధ్యాయుడి పదోన్నతి జాబితాలో మొదట్లో ఉన్న సాయిరాం అనే ఉపాధ్యాయుడు తిరుమలచైతన్య పుణ్యమాని ఇప్పుడు సస్పెండయ్యారు. ఈయన పాత్ర ఎంతో డీఈవోకు తెలియంది కాదు. అలాగే దుర్గా ప్రసాద్ అనే మరో ఉపాధ్యాయుడికి గుండెకు శస్త్రచికిత్స జరిగింది. లక్ష్మణరావు అనే మరో ఉపాధ్యాయుడికి కొన్నాళ్ల క్రితమే హార్ట్‌లో స్టంట్‌లు వేశారు. వీరి పాత్ర ఏమాత్రమనేది కాసేపు ఆలోచించివుంటే తిరుమల చైతన్యకు అర్థమైవుండేది. ఆరుగురు మహిళా టీచర్లు, ఎచ్చెర్ల ఎంఈవో-2, లావేరు ఎంఈవో-1, ఐదుగురు పోలీసులతో రెండు ఎగ్జామ్ సెంటర్లలో రైడ్‌లు చేస్తే.. స్లిప్పులు కలిగి వున్నారన్న విద్యార్థులు ఐదుగురు మాత్రమే దొరకడం కొండను తవ్వి ఎలుకను పట్టడమే. ఐదుగురు విద్యార్థుల కోసం 14 మంది టీచర్లు, ఒక గుమస్తాను బలి తీసుకున్నారంటే తిరుమల చైతన్య ఏం సాధించినట్లు? తిరుమల చైతన్య సస్పెండ్ చేసిన వారిలో ఒక ఉపాధ్యాయుడు విద్యార్థుల కోసం ప్రతీ నెల తన జీతంలో రెండో వంతు ఖర్చు చేస్తున్నారు.

టీచర్ల బదిలీల్లో తాను అక్రమాలకు పాల్పడలేనంటూ గతంలో డీఈవో పోస్టుకు సెలవు పెట్టి వెళ్లిపోయిన తిరుమల చైతన్య అప్పుడూ పబ్లిసిటీనే ఆశ్రయించారు. టీచర్స్ యూనియన్ నాయకులు రికమండేషన్లు చేయించకూడదని, తన వద్ద అన్నీ నిబంధనల మేరకే జరుగుతాయని అప్పుడూ పబ్లిసిటీకే తెర లేపారు. అయితే అసలు తిరుమల చైతన్య తన హయాంలో నిబంధనలకు విరుద్ధంగా ఒక్క పని కూడా చేయలేదా అంటే అక్రమ బదిలీలే కోకొల్లలు ఉన్నాయని ఉపాధ్యాయ సంఘ నేతలు చెబుతున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత తిరుమల చైతన్యను వెనక్కు పంపి పగడాలమ్మను డీఈవోగా తేవాలని భావించారు. కానీ తిరుమల చైతన్య ఇక్కడి రాజకీయ నాయకుల ప్రాపకం కోసం వారు చెప్పిన పనులన్నీ చేసి తన స్థానాన్ని పదిలపర్చుకున్నారు. జులైలో రిటైరయ్యే లోపు కూడా తనను తప్పించి పగడాలమ్మను తీసుకువచ్చే సూచనలున్నాయనే అభద్రతా భావంతో ఈ సంచలనానికి తెర లేపారు. 17 మంది సిబ్బంది రెండు పరీక్షా కేంద్రాలను చుట్టుముట్టి అల్లకల్లోలం సృష్టించిన వాతావరణంలో ఇంగ్లీష్ పరీక్షను విద్యార్థులు ఎలా సవ్యంగా రాసుంటారో తిరుమల చైతన్యే చెప్పాలి. మాస్ కాపీయింగో, మాల్‌ప్రాక్టీసో జరుగుతుందని నిరూపించడం కోసం ఒకే సామాజికవర్గానికి చెందిన విద్యాశాఖాధికారులను పట్టుకెళ్లి మరీ రైడ్ చేసిన తిరుమల చైతన్య ఎపిసోడ్‌లో ఒక్కటే బలమైన వాస్తవం. కుప్పిలి జెడ్పీ హైస్కూల్‌లో ఇన్విజిలేషన్ విధుల్లో లేని ఇంగ్లీష్ ఉపాధ్యాయుడు తాను పని చేస్తున్న పాఠశాల విద్యార్థులు ఆ సెంటర్‌లో పరీక్ష రాస్తుండగా, అక్కడ కూర్చుని వారి కోసం జవాబులు తయారు చేయడం ఒక్కటే. ఈ విషయాన్ని మరో 13 మందికి ఆపాదించి 400 మంది పిల్లలను భయోత్పాతంలోకి నెట్టేసిన తిరుమల చైతన్య పదవీ విరమణ తర్వాత ప్రశాంత జీవితాన్ని గడపొచ్చు. కానీ పోయిన జిల్లా పరువు అంత ప్రశాంతంగా వెనక్కు రాదు. ఈ జిల్లా నుంచి రేపు ఎవరైనా స్టేట్‌ర్యాంకర్‌గా నిలిస్తే చూసి రాస్తే ఎవరికైనా ర్యాంకులొస్తాయన్న భావన పక్క జిల్లాల్లో కలిగిత ఆ తప్పు తిరుమల చైతన్యదే. కుప్పిలి జెడ్పీ హైస్కూల్‌లో ఒక టీచర్ సమాధానాలు రాస్తున్నంత మాత్రాన అక్కడి నుంచి కిలోమీటరున్నర దూరంలో ఉన్న మోడల్ స్కూల్‌కు ఆ పేపర్లు చేరుతున్నట్టేనా? నిజంగా ఉపాధ్యాయులే విద్యార్థులకు సమాధానాలు ఇవ్వాలి అనుకుంటే వారి చేతిలో ఉన్న మొబైల్ ద్వారా వాట్సాప్‌కు తెప్పించుకుంటే సరిపోదా? ఒక్క టీచర్ చేతిలో ఆన్సర్ సీట్లు ఉన్నంత మాత్రాన ఆ పాఠశాల స్లిప్పుల కర్మాగారమైపోతుందా? చివరిగా నాలుగు వాహనాల్లో వచ్చిన డీఈవో బృందం ఒకటికి పదిసార్లు అక్కడ లేని కుప్పిలి జిల్లాపరిషత్ స్కూల్ జూనియర్ అసిస్టెంట్ బలివాడ కిశోర్ కోసం ఎందుకు పదే పదే అడిగారు? నిజంగా విద్యార్థుల దుస్తుల్లో స్లిప్పులు పట్టుకున్నారా? లేదూ అంటే ఎవరి వద్దనైనా స్లిప్పులుంటే డీఈవో డిబార్ చేస్తారు కాబట్టి వాటిని ఇచ్చేయమని కోరితే, ఇచ్చేశారా? ఆ స్లిప్పుల్లో సమాధానాలకు సరిపడే ప్రశ్నలు పరీక్షా పత్రంలో ఎన్ని ఉన్నాయి? ఇటువంటి దేనికీ సమాధానాలు లేకుండా ఓవరాక్షన్ చేసిన డీఈవోతో కూడిన బృందం భవిష్యత్తులో ఇందుకు మూల్యం చెల్లించుకోక తప్పదు.

# ఏపీ ఉద్యోగులకు శుభవార్త

**అమరావతి:** ఏపీ కూటమి ప్రభుత్వం ఉద్యోగులకు పండుగ లాంటి వార్త అందించింది. ఉద్యోగుల బకాయిలను వారి ఖాతాల్లో జమ చేస్తోంది. ఎంప్లాయిస్ జీఎల్ఐ, జీపీఎఫ్ బకాయిలను ప్రభుత్వం విడుదల చేసింది. సోమవారం ఉదయం 11.30 గంటల నుంచి ఉద్యోగుల ఖాతాల్లో బకాయిలు పడుతున్నాయి. మొత్తం రూ.6,200 కోట్లు విడుదల చేయాలని సీఎం చంద్రబాబునాయుడు అధికారులను ఆదేశించారు. ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు నిధులు విడుదల అవుతున్నాయి. నేరుగా ఉద్యోగుల ఖాతాల్లో నిధులు జమ అవుతున్నాయి మంగళవారం లేదా బుధవారం సాయంత్రానికి పూర్తి స్థాయిలో నిధులు విడుదల అవుతాయని ఆర్థిక శాఖ అధికారులు చెబుతున్నారు. బకాయిలు జమ అవుతున్నాయని ఏపీ ఎన్జీవో అసోసియేషన్ నేతలు ఈ మేరకు ధృవీకరించారు. సీపీఎస్, జీపీఎఫ్, ఏపీజీఏఐ కింద ఆంధ్రప్రదేశ్ ఆర్థికశాఖ రూ.6,200 కోట్లు విడుదల చేసింది. కాగా జనవరిలోనూ రూ.1,033 కోట్ల బకాయిలను ప్రభుత్వ ఉద్యోగులకు ఏపీ ప్రభుత్వం చెల్లించిన సంగతి తెలిసిందే.

**ఏపీ జేఏసీ నేతల హర్షం..**

ప్రభుత్వ ఉద్యోగులు, పింఛనర్ల పెండింగ్ బకాయిలకు సంబంధించి రూ.6,200 కోట్లు విడుదల చేయడానికి ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాలివ్వడంపై ఏపీ జేఏసీ నేతలు హర్షం వ్యక్తం చేశారు. ఉద్యోగ సంఘాల నాయకులు ముఖ్యమంత్రి నిర్ణయాన్ని స్వాగతిస్తూ ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలియజేశారు.

# శిష్టకరణ కుటుంబానికి సీఎం రిలీఫ్ ఫండ్

(మొదటిపేజీ తరువాయి)

ఫండ్ గురించి వివరించారు. స్వయంగా చక్రధరమహంతి కవితకు డిటైల్స్ తీసుకోమని చెప్పి, కావాల్సిన అన్ని డాక్యుమెంట్స్ సేకరించి, ఫైల్‌గా తయారుచేసి అప్లై చేయడానికి రాజాకు అందజేశారు. అనంతరం రాజా విజయవాడ సెక్రటేరియట్‌లో తన పలుకుబడి ఉపయోగించి అత్యంత తక్కువ సమయంలో రూ.3.65లక్షలు ఆర్థిక సహాయం చెక్కు రూపంలో ఆ కుటుంబానికి చంద్రన్న అండ అందేలా చేశారు. మునుపెన్నడూ కులంలో లేనివిధంగా ఆ కుటుంబానికి సాయమందించి, వారికి ధైర్యాన్ని, భరోసాని ఇవ్వడంపై అధ్యక్షుడు దార్శనికతను కులపెద్దలు, విమర్శకులు సైతం కొనియాడారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి మానాపురం గౌరీ శంకర్, కోశాధికారి బెహరా రాధ, శేఖరమహంతి శ్రీనివాస్, డబ్బీరు వెంకటరావు, బద్రిమహంతి వెంకటరావు, చక్రధర మహంతి కవిత, బలివాడ సత్యారావు, ప్రతాపరావు శ్రీనివాస్, బాసంగి తిరుపతిరావు, దధిరావు వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# త్వరలో తూర్పుకాపు చైతన్య సమావేశాలు



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

తూర్పుకాపు జాతి యావత్తూ కదిలి రావటానికి త్వరలో జిల్లా వ్యాప్తంగా మండల కేంద్రాల్లో ముందుగా తూర్పుకాపు జాతి ఐక్యత చైతన్య సదస్సులు ఏర్పాటు చేస్తామని శ్రీకాకుళం జిల్లా తూర్పుకాపు సామాజికవర్గం ప్రతినిధులు సురంగి మోహనరావు, డోల జగన్మోహన్, లంక గాంధీ, శాసపు జోగినాయుడు, ఇజ్జాడ శ్రీనివాసరావు అన్నారు. ఆదివారం రాత్రి రామలక్ష్మణ జంక్షన్‌లోని వెన్నెల హోటల్‌లో జరిగిన శ్రీకాకుళం తూర్పుకాపు సామాజిక సేవా సంఘం విస్తృత స్థాయి సమావేశంలో వారు మాట్లాడుతూ జాతి ఐక్యత కోసం చైతన్య సదస్సులు ఏర్పాటు ప్రధాన లక్ష్యమని అన్నారు. జిల్లాలో అత్యధిక శాతం జనాభా కలిగిన తూర్పుకాపులు నేడు అన్ని రంగాల్లో వెనుకబడి ఉన్నారని, ఇది ఎంతో ఆవేదన కలిగిస్తుందన్నారు. స్వాతంత్ర్య అనంతరం జిల్లాను పాలించే నేతల్లో తూర్పుకాపు సామాజిక వర్గం ప్రతినిధులు ఎక్కువ సంఖ్యలో ఉండేవారని, నేడు అందుకు విరుద్ధంగా ఉందని, ఇది తగదని వారు హితవు పలికారు. ఉమ్మడి శ్రీకాకుళం జిల్లాలో సుమారు 8 లక్షల జనాభా కలిగిన తూర్పుకాపు సామాజికవర్గం నేడు రాజకీయంగా, ఆర్థికంగా, సామాజికంగా విద్యాపరంగా వెనుకబడి ఉన్నారని, ఈ పరిణామాల వల్ల తూర్పుకాపులు తల్లడిల్లుతున్నారని, దీన్ని దృష్టిలో పెట్టుకొని ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఉన్న 38 మండలాల్లో జాతి ఐక్యత చైతన్య సదస్సులు, యువతకు ఉపాధి అవకాశాలు కల్పించే దిశగా స్కిల్ డెవలప్మెంట్ అథారిటీ సారథ్యంలో శిక్షణా కార్యక్రమాలు పెద్ద ఎత్తున ఏర్పాటు చేస్తామని చెప్పారు. త్వరలో ఇందుకు సంబంధించి టూర్ ప్రోగ్రాం విడుదల చేస్తామన్నారు. వంశధార ప్రాజెక్ట్ రెండోదశ నిర్మాణం వల్ల దెబ్బతిన్న నిర్వాసితులకు ఇంతవరకు పూర్తిస్థాయిలో పరిహారం ఇవ్వకపోవడం దారుణమని, ఇప్పటికైనా అర్హులైన నిర్వాసితులకు గత ప్రభుత్వం పెంచిన పరిహారాన్ని సత్వరమే అందించి ఆదుకోవాలని కోరారు. తూర్పుకాపు సామాజిక వర్గం భవన్ నిర్మాణానికి విరాళాలు ప్రకటించిన దాతలు వెంటనే కమిటీ ప్రతినిధులకు అందజేయాలని, కాపుభవన్ నిర్మాణం ఎన్నో ఏళ్ల కలని, ఈ స్వప్నం త్వరలో సాకారం కాబోతుందన్నారు. రాజకీయాలకు అతీతంగా అన్ని వర్గాల వారు విరివిగా విరాళాలు అందించి సకాలంలో భవన్ నిర్మాణం పూర్తి కావటానికి సహకరించాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో జిల్లా తూర్పుకాపు ఉద్యోగ సంక్షేమ సంఘం ప్రతినిధులు డోల తిరుమలరావు, పొగిరి సుగుణాకరారావు, కిలారి నారాయణరావు, డాక్టర్ ఎం.రామజోగినాయుడు, పీటీ నాయుడు, వాళ్ల శ్రీరాములునాయుడు, రౌతు గోపి, సురవరం పార్వతి, గెడ్డాపు రాజేంద్రప్రసాద్, ఎస్. సత్యనారాయణ, పిసిని వసంతరావు, కురిటి దుర్గారావు, డాక్టర్ చందక రామకృష్ణ, జిల్లా తూర్పు కాపు సంక్షేమ సంఘం ప్రతినిధులు పల్లి సురేష్, పాండ్రంకి రమేష్ నాయుడు, డోల బాలమురళీ కృష్ణ, ఎం.శంకర్‌నారాయణ, నేతల అప్పారావు, అంబేద్కర్ యూనివర్సిటీ ఉద్యోగులు భీమారావు, చంద్రమౌళి, వ్యాయామ ఉపాధ్యాయులు బొత్స శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



Printed by N.V.S. prasad, at Srikakulam and published by SATYAM PRINTERS, plot No. 8, Santamma colony, Srikakulam- 532001, Andhrapradesh on behalf of SANCHALANA SAYANKALA PATRIKA SATYAM, Srikakulam. Editor N.V.S. Prasad, Srikakulam, Andhra Pradesh. APTEL No. 2005/17967. Postal Reg. No. D/RNP/SKL-12/12-15.